సంపుటం 13 సంచిక 180

రిజిస్టరు నెం. H 45 స్థాపితం 1925

గోలకొండపత్రిక

హైదరాబాదు 11—7—1960 సోమవారం

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి ఎం. ఎ.

4 పేజీలు 7 నయాపైసలు

101183

నమ్మెనుండి మినహాయింపునకు అస్సాం తంతి తపాల సిబ్బంది అభ్యర్థన

షిల్లాంగ్, జులై 10: అస్సాంలోని కల్లోల పరిస్థితిదృష్ట్యా తమ సంఘాన్ని ప్రతిపాదిత సమ్మెనుండి మినహాయించాలని కేంద్ర సిబ్బంది సమాఖ్య చర్యాసంఘాన్ని యిచటి తంతి తపాలాశాఖ సిబ్బంది సంఘం కోరినది. దూరప్రాంతాలలోవున్న తమ బంధువుల సంబంధీకుల క్షేమ వార్తలను తెలుసుకొనుటకు ప్రజలు తహతహ పడుతారు. కాబట్టి వారికట్టి సమాచారాన్ని అందించుటకు వీలుగా తాము పనిలోకివచ్చుట అత్యవసరమని భావిస్తున్నామన్నారు ఈ సంఘీయులు.

వరంగల్లులో సమ్మెనెదుర్కొనుటకు యేర్పాట్లు

వరంగల్, జులై 10. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది తలపెట్టిన సమ్మెవల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కొనుటకు అవసరమయ్యే చర్యలను నిన్న యిచట కలెక్టర్ శ్రీ మొహమ్మద్ సిద్దిక్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో చర్చించారు. ఈ సభలో అధికారులు, అనధికారులుగూడ పాల్గొన్నారు. సమ్మెకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కేంద్రీకరించుటకు రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. ఆర్. సాయ్ పంపిన సందేశాన్ని తొలుత కలెక్టర్ సభలో చదివి వినిపించారు.

కేంద్ర ఉద్యోగుల సమ్మె నివారణకు జరిగిన ప్రయత్న వైఫల్యం

సమ్మెదారులపై కఠిన చర్యలు తీసుకొనడానికి ప్రభుత్వ ఉత్తర్వు

రైల్వే, పి అండ్ టి ఉద్యోగులలో చాలా భాగం పనిలో చేరడానికి సంసిద్ధత

హైదరాబాద్, జులై 10

జులై 11 వ తేదీ అర్ధరాత్రినుండి కేంద్ర ప్రభుత్వోద్యోగులు సమ్మెకు తలపడిన అవసర సర్వీసుల నిర్వహణకై ఇక్కడి కేంద్రప్రభుత్వ శాఖలన్నీ తగు ఏర్పాట్లు చేశాయి.

నగర పోలీసు రక్షణ ఏర్పాట్లకై తరలింపబడినారు. భారత సేవక సమాజ వాలంటీర్లు, ఎన్. సి సి., భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, భారత సాంఘిక సేవా సంఘ వాలంటీర్లు సమ్మె చేయు ప్రభుత్వోద్యోగుల స్థానే పనిచేయుటకు సిద్ధంగాఉన్నారు.

పై సంస్థలవారుకాక ఇంకా పెక్కు సాంఘిక, తదితర సంస్థల వ్యక్తులు సేవ చేయడానికై ముందుకు వస్తున్నారు. రైల్వేలందు ఫైర్ మెన్లుగా పని చేయుటకు చాలా ఫ్యాక్టరీలనుండి పనివారలు వస్తున్నారు. సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌లోని ఉద్యోగులు చాలా భాగం సమ్మె జరిగినా పనిలో చేరుటకు తమ ఆయత్తతను వ్యక్తం చేశారు. సమ్మెలోకి దిగిన వారిపై గట్టి చర్యలు తీసుకొనబడగలవు.

గూడ్సు బండ్లుకాక కనిసం 15 ప్రయాణీకుల ట్రయిన్లు నడుపుటకు ఏర్పాట్లు చేయబడినవి.

రాజధానిలోని పోస్టు అండ్ టెలిగ్రాఫ్ ఉద్యోగులలో అధిక భాగం పనిలో ప్రవేశించుటకు ఆయుత్తతను కనబరుస్తున్నారు. అధికారులను తమకు రక్షణ మరియు కాకపోకల బందోబస్తు చేయవలసిందిగా కోరారు. పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఒక ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్ ఏర్పాటు చేయబడినది. సమ్మె కాలంలో పోస్టు, టెలిగ్రాఫ్, టెలిఫోన్ ఏర్పాట్ల గూర్చి ప్రజలకు దీని ద్వారా సహాయం ఇవ్వబడుతుంది. అంట నగరాలలో ప్రదర్శనలు, సమావేశాల నిషేధిస్తూ చర్యలు తీసుకోబడినవి.

శ్రీ పి. సుబ్బరాయన్ విజ్ఞప్తి

కొత్తఢిల్లీ, జులై 10

కేంద్ర రవాణా, కమ్యూనికేషన్లమంత్రి డా॥ పి. సుబ్బరాయన్ సమ్మెలో పాల్గొనరాదని, తమ శాఖల ఉద్యోగులకు అపీల్ చేశారు. ఉద్యోగుల వాంఛితాల ప్రభుత్వము అణచదలవడంలేదని, కాని దేశ ఆర్థిక, సాంఘిక భద్రతకు స్వాతంత్ర్యానికి ప్రమాదం ఏర్పడటాన్ని సహించబోదన్నారు.

సమ్మెలో పాల్గొనకుండుటకు నిర్ణయం

అఖిలభారత సి. పి. డబ్ల్యు. డి. వర్కర్లయూనియన్ కలకత్తా అఖిలభారత సి.సి. డబ్ల్యు.డి. ఉద్యోగుల సంఘము ఢిల్లీ ప్రస్తుతపరిస్థితుల్లో సమ్మెలో పాల్గొనకుండా ఉండుటకు నిర్ణయించుకొన్నారు.

ప్రభుత్వఉత్తర్వు

సమ్మెలో పాల్గొనే ఉద్యోగులపై కఠినమైనచర్యలు తీసుకోడానికి ఉద్యోగంనుండి తొలగింపు జరిమానాల విధింపునకు భారతప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినదని తెలుస్తున్నది.

సమ్మెచేస్తున్న ఉద్యోగులు అరెస్టు చేయబడటమేకాక వెంటనే ఉద్యోగాలనుండి సస్పెండ్ చేయబడుతారు. ఆతర్వాతతొలగించబడుతారు. సాధారణంగా లైబులిటీ జరిమానాలుకాక, ప్రభుత్వం ఇట్టిచర్యలు తీసుకొనడానికి నిర్ణయించినది.

సమ్మెలో పాల్గొనే శాశ్వతోద్యోగులకు ఉద్యోగంనుండి తొలగింపునకు ఒకనెలనోటీసు ఇవ్వబడుతుంది.

రాష్ట్రపతి వేతనం రు. 25 వందలే

కొత్తఢిల్లీ, జులై 10

రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ తమవేతనంలో పెద్ద మొత్తాన్ని తగ్గించుకొన నిర్ణయించుకున్నారు. 1960 ఆగస్టు నుండి వారు కేంద్రమంత్రులు పొందే వేతనంకన్నా కొద్ది ఎక్కువ అనగా రూ. 2500 మాత్రమే నెలసరి వేతనముగా తీసుకొనగలరు.

రాజ్యాంగంప్రకారంరాష్ట్రపతి రూ. 10 వేల వేతనాన్ని తీసుకోవచ్చు, 1952లో దీనిలో నాల్గువేలను తగ్గించుకున్నారు. 1955లో మరో వెయ్యి తగ్గించుకున్నారు

సమ్మె ప్రతిపాదనకు సర్వత్రా చుక్కెదురు

సమ్మె కాలంలో పనిచేస్తామని అనేకసంస్థలు, వ్యక్తుల ప్రకటనలు: సమ్మెలో పాల్గొనరాదని పలుసంఘాల నిర్ణయం

న్యూఢిల్లీ, జులై 10

రేపు సమ్మె ప్రారంభించాలను కొంటున్న కేంద్రప్రభుత్వోద్యోగులకు అన్నివర్గాలనుండి వ్యతిరేకత ఎదురవుతున్నది. అనేక కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఘాలు తాము సమ్మెలో పాల్గొనడం లేదని ప్రకటించినవి. సమ్మె ప్రారంభమయితే అవసర సర్వీసుల్ని కొనసాగించడానికి అనేకసంస్థలు నాయకులు, ఇతరవ్యక్తులు తమ సంసిద్ధతను ప్రకటించారు. వివిధ రాష్ట్రప్రభుత్వాలు సమ్మె కాలములో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రకటించినవి.

సమ్మెలో పాల్గొనరాదని పశ్చిమ రైల్వే మజ్‌దూర్ సంఘం నిర్ణయించినట్లు ఆసంఘ రాజకోటశాఖ జాయింటు సెక్రటరీ శ్రీ యు. జె. కురేషి ప్రకటించారు. రాజకోటడివిజన్‌లోని 10 వేల మంది రైల్వే ఉద్యోగులలో 75 శాతం సమ్మెలో పాల్గొనరని ఐ.ఎన్.టి.యు.సి. కి సన్నిహితంగా ఉన్న వర్గాల ద్వారా తెలుస్తున్నది.

కొత్తగూడెంలో వ్యతిరేకత

కొత్తగూడెం, జులై 10: తంతి తపాలా శాఖ (కొత్తగూడెం) నాల్గో తరగతి ఉద్యోగులు గత రాత్రి యిక్కడ సమావేశమై సమ్మెతో తమకు సంబంధం ఉండదని ప్రకటించారు.

గన్ కేరేజి ఫ్యాక్టరీ ఉద్యోగుల వ్యతిరేకత

జబల్‌పూర్, జులై 10: గన్ కేరేజి ఫ్యాక్టరీకి చెందిన సుమారు 7 వేలమంది ఉద్యోగులు సమ్మెనోటీసును యివ్వలేదని ప్రకటించారు. ఈలోగా స్థానిక అధికారులు సమ్మె కాలంలో పనిచేయడానికి వాలంటీర్లనురిక్రూట్ చేస్తున్నారు.

శ్రీ వాసవాడ విజ్ఞప్తి

అహ్మదాబాద్, జులై 10: ఐ.ఎన్.టి.యు.సి. ప్రధానకార్యదర్శి భారత రైల్వేఉద్యోగుల జాతీయ ఫెడరేషన్ అధ్యక్షుడు అయిన శ్రీ యస్. ఆర్. వాసవాడ ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వోద్యోగులు సమ్మె చేయమని వారిని మార్గభ్రష్టులను పెడుతున్నవారి వైఖరిని తీవ్రంగా విమర్శించారు ప్రధానిజవహర్లాల్ విజ్ఞప్తిని కొందరు పాటించక పోవడం విచారకరమన్నారు.

స్కౌట్లు, గైడ్ల సహకారం

హైదరాబాద్, జులై 10: భారత స్కౌట్లు, గైడ్లు ఆంధ్రప్రదేశ్ (హైదరాబాద్ శాఖ) గౌరవ కార్యదర్శి ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె ప్రారంభమయితే దేశానికి సేవ చేయడానికి స్కౌట్లు, గైడ్లు సిద్ధము కావాలని విజ్ఞప్తిచేశారు.

వ్యాపారస్తుల సహకారం

ఆంధ్రప్రదేశ్ వాణిజ్య మండలి అధ్యక్షుడు శ్రీ పి. ఎల్. ధండారీ వ్యాపారుల తరఫున ఒక ప్రకటన చేస్తూ సమ్మెను భగ్నం చేయడానికి తాము పూర్తి సహకారాన్నివ్వగలమని అన్నారు. ఈసమ్మెవలనఅశాంతి పెరుగుతుందని, దానివలన విషఫలితాలు కలుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ప్రజాసంస్థల సహకారం

పాట్నా, జులై 10: ముఖ్యమంత్రి డా॥ శ్రీకృష్ణసిన్హా విజ్ఞప్తిపై వివిధ ప్రజాసంస్థల ప్రతినిధులు సమ్మెలరిగితే వాలంటరీగా వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కూడ తమ సంసిద్ధతను ప్రకటించారు.

ముస్లింలీగ్ వ్యతిరేకత

మద్రాసు, జులై 10: భారత ముస్లింలీగ్ అధ్యక్షుడు శ్రీ మహ్మద్ ఇస్మాయిల్ సంకల్పిత సమ్మెవలన ప్రయోజనం ఏమీఉండదని, దేశానికి తీవ్రమయిన హానికలుగుతుందని పేర్కొన్నారు.

ఉత్తర రైల్వే యూనియన్ కూడ సమ్మెకు వ్యతిరేకమే

న్యూఢిల్లీ, జులై 10: ఉత్తర రైల్వేయూనియన్ అత్యవసర సమావేశాన్ని జరిపి రాయబారాలద్వారా సమస్యను పరిష్కరించుకోవాలిగాని సమ్మెకు పూనుకోరాదని ఉద్యోగులకు విజ్ఞప్తి చేసింది. సంఘ కార్యదర్శి శ్రీ కె.ఎల్. దత్తా కేంద్రకార్మిక మంత్రితో నిన్న చర్చలు జరిపారు.

రాయపూర్‌లో వాలంటీర్లు

రాయిపూర్, జులై 10: రాయపూర్ మహిళామండలి అధ్యక్షురాలు శ్రీమతి సుశీలాబాయి సమ్మె కాలములో మహిళా స్వచ్ఛంద సేవకులు పనిచేయగలరనిప్రకటించినది. కాంగ్రెసు నాయకులు, మునిసిపల్ సభ్యులు, పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు వాలంటరీగా పనిచేస్తామన్నారు.

చండీఘర్‌లో సంసిద్ధత

చండీఘర్, జులై 10: రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో సుమారు 8000 మంది తాము వాలంటీర్లుగా పనిచేస్తామని ప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి తెలియజేశారు.

సంఘసేవా సంస్థల సంసిద్ధత

కొత్తఢిల్లీ, జులై 10: ఢిల్లీలోని సంఘ సంక్షేమ సంస్థలు, సాంఘిక కార్యకర్తలు నిన్న శ్రీ మతి రజా చరణ్ అధ్యక్షతలో సమావేశమై కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెను నిరసిస్తూ తీర్మానం చేశారు. సుమారు 250 మంది వాలంటీర్లు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొనబడింది.

పంజాబ్ గవర్నర్ విజ్ఞప్తి

జలంధర్, జులై 10: పంజాబ్ గవర్నర్ శ్రీ ఎస్. వి. గాడ్గిల్ నేడొక కళాశాల ఉత్సవంలో ప్రసంగిస్తూ యీసమ్మె కెదురింపునుఎదుర్కొవలసిన సమయం వచ్చిందన్నారు.

శ్రీ గాడ్గిల్, రాజభవనం సిబ్బంది సమ్మె జరిగితే ఆ సమయంలో తాము పనిచేయగలమని ప్రకటించారు.

గుజరాత్ కేరళ, మద్రాసుమున్నగు రాష్ట్రాలలో ప్రభుత్వాలు సమ్మె కాలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను గురించి చర్చలు జరిపి తగు చర్యల్ని ప్రకటించినవి.

సమ్మెకు అనుకూలురు

హైదరాబాద్, జులై 10: ఎన్. సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటన చేస్తూ సమ్మెను జరగకుండాచేస్తే దేశ స్వాతంత్ర్యానికే భంగకరమన్నారు. సమ్మె ప్రశాంతంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం రాయబారాలతో ఒప్పందాన్ని కుదుర్చుకోడానికి సిద్ధపడితే సమ్మె ప్రతిపాదనను విరమించుకోగలమన్నారు.

భారత ప్రజాసోషలిస్టుపార్టీ ఉపాధ్యక్షుడు శ్రీ సురేంద్రనాథ్ ద్వివేది (ఎం. పి.) కార్మిక రంగంలో రాజకీయాల్ని ప్రవేశపెట్టినందుకు కాంగ్రెసునాయకుల్ని విమర్శించారు.

అఖిలభారత హింద్ మజ్దూర్ సభ అధ్యక్షుడు దివాన్ చాన్ ఒక ప్రకటనలో ఆర్డినెన్సును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

ఆర్డినెన్సును జారీచేసి సమ్మెను నిషేధించిన ప్రభుత్వచర్య కార్మికుల మూలహక్కులకు భంగకరమని రెవల్యూషనరీ సోషలిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ త్రిదిబ్‌కుమార్ చౌదరి (ఎం.పి.) అన్నారు.

విజయవాడలోసమ్మె

విజయవాడ, జులై 10: విజయవాడలోని కేంద్రప్రభుత్వోద్యోగులు 8000 మందిలో 90 శాతం ఆర్డినెన్సు ఉన్నా జులై 11 నుండి సమ్మెచేస్తారని చర్యా సంఘఅధ్యక్షుడు శ్రీ బి.టి. సింగ్ ప్రకటించారు. నగర స్టేట్ యూనియన్ కౌన్సిల్, నగర మజ్దూర్ సంఘము, మరో 14 కార్మిక సంఘాలు సమ్మెను బలపరుస్తూ కరపత్రాన్ని జారీచేసినవి.

దక్షిణరైల్వే ఉద్యోగులసంఘము సమ్మెకాలంలో అవసరసర్వీసులో పనిచేసేటట్లు చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

శ్రీ డాంగే సమర్థన

బొంబాయి, జులై 10. కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెతో రాజకీయాలకు సంబంధం లేదన్నారు కేంద్ర కార్మిక మంత్రి శ్రీ నందాకు ఒక లేఖ వ్రాస్తూ ఉద్యోగుల డిమాండ్లను ఆమోదించాలనీ, రాయబారాల ద్వారా వివాదాల్ని పరిష్కరించుకోవాలనీ కోరారు.

ఎ. ఐ. టి. యు. సి. కార్యదర్శి శ్రీ తంగమణి ఒక ప్రకటనలో అత్యవసర పరిస్థితిలేకుండా రాష్ట్రపతి ఆర్డినెన్సును జారీచేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

కేంద్ర ప్రభుత్వ గుమాస్తాల సంఘ కార్యాచరణ సమితి ఢిల్లీలో ఒక ప్రకటన చేస్తూ ఆర్డినెన్సు ఉద్యోగుల స్వాతంత్ర్యానికి భంగకరమన్నారు.

సమ్మెను నిరోధించడానికి తగు చర్యలు తీసుకోవాలని శ్రీ ఎన్. జి. గోరె, డా॥ కె. బి. మీనన్ (ఎం.పి.)లు పార్లమెంట్ అత్యవసరసమావేశాన్ని జరపాలని పార్లమెంటులోని కమ్యూనిస్టుపార్టీ, శ్రీ టి. సి. ఎన్. మీనన్ (ఎం.పి.) విజ్ఞప్తిచేశారు.

ఉపరాష్ట్రపతి వివరణ

న్యూఢిల్లీ, జులై 10: తాను ఆర్డినెన్సును జారీచేయడానికి విముఖుడననికొన్ని పత్రికలలోవచ్చినవార్తల్ని ఖండిస్తూ తాను కార్యాచరిక రాష్ట్రపతిగా ఉన్నసమయంలో ప్రభుత్వం తనను ఆర్డినెన్స్ జారీచేయుమని అడిగితే తప్పక చేసిఉండేవాడినన్నారు.

అస్సాం పరిస్థితిపై కృష్ణమీనన్ చర్చలు

దౌర్జన్య చర్యలకు పూనుకోవలదని అస్సామీయులకు ప్రధాని నెహ్రూ విజ్ఞప్తి

గౌహతి, జులై 10

అస్సాంలో అధికార భాషా సమస్యపై తలెత్తిన కలతలపట్ల ప్రధాని నెహ్రూ తనతీవ్ర విచారాన్ని వ్యక్తపరిచారు. మన జాతీయ భాషల విషయమై యిట్టి విధానాన్ని ప్రోత్సహించరాదన్నారు.

అస్సాం ప్రజలకొక సందేశాన్నిస్తూ ప్రజాస్వామ్య పథముగా దౌర్జన్య చర్యలు సహించబడవన్నారు.

రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణ మీనన్ యిక్కడి పరిస్థితిని పరిశీలించే నిమిత్తము విమానములో నేడిక్కడికి వచ్చారు. ఆయన వెంట కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డికూడ ఉన్నారు. వారు విమానము దిగిన వెంటనే అస్సాం గవర్నరు శ్రీనగేశ్‌తో చర్చలకు కారులో సర్క్యూట్ హౌస్‌కు వెళ్ళారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి ఫక్రుద్దీన్ అహ్మద్, అస్సాం పి. సి. సి. అధ్యక్షుడు నిద్దీనాథ్ శర్మ తదితర అధికార అనధికార ప్రముఖులుకూడ ఉన్నారు.

శ్రీ సంజీవరెడ్డి ఆతరువాత షిల్లాంగ్ వెళ్ళారు. శ్రీ మీనన్ తేజ్‌పూర్ మీదుగా ఢిల్లీకి బయలుదేరుతున్నారు.

పరిస్థితి బాగుపడిందనీ, గౌహతి, షిల్లాంగ్‌లు ప్రశాంతముగా ఉన్నవనీ ప్రభుత్వ ప్రతినిధి అన్నారు. కలత ప్రాంతాలలో సివిల్ అధికార్ల సహాయార్థము సైన్యాన్ని సమకూర్చడ మొక్కటే ప్రభుత్వము చేసినపని అన్నారు.

గోల్‌పారాజిల్లా ధుబ్రి, భాంగిగాం మున్నగుచోట్ల సివిల్ అధికారులు, పోలీసులకు సైన్యము సహాయము చేస్తున్నది.

అలిపూర్‌దార్స్ (ఉత్తర బెంగాల్) లలో దౌర్జన్య చర్యల వార్తలు చేరిన తరువాత జోహార్‌లో కొందరిని కొట్టడము జరిగిందని ఆ ప్రతినిధి అన్నారు.

సిల్చరి, అలిపూర్, జల్పాయిగురి (ఉత్తర బెంగాల్‌లో) యీ కలతల వలన ఆర్గురు హత్యచేయబడ్డారు.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన డా॥ హీరేన్ ముఖర్జీ, శ్రీమతి రేణుచక్రవర్తి ప్రభృతి 7 గురు పార్లమెంటు సభ్యులు అస్సాం వచ్చి బెంగాల్ ప్రజలలో విశ్వాసాన్ని కలిగించవలసిందిగా కోరుతూ నెహ్రూకు టెలిగ్రాం యిచ్చారు.

బస్ నదిలోపడి 30 మంది మరణం

భోపాల్, జులై 10

ఒక ప్యాసింజర్ బస్ మధ్యప్రదేశ్‌లోని భింద్ జిల్లాలో లాహార్-జాన్సీ రోడ్డుపై వెడుతూ వరదలతో పొంగి ప్రవహిస్తున్న మిర్గావదిలో పడటం వలన సుమారు 30 మంది ప్రయాణీకులు మునిగిపోయారని అధికార వార్త వలన తెలుస్తున్నది.

సబ్ డివిజనల్ ఆఫీసర్, పోలీసు సూపరింటెండెంట్ ప్రమాద స్థలికి వెళ్ళారు.

స్వామి చిన్మయానంద నగరానికిరాక

హైదరాబాద్, జులై 10

స్వామిచిన్మయానంద ఇచ్చటికి ఈనెల 12వతేదీనవచ్చి 18వతేదీనుండి సికింద్రాబాద్ కీస్ హైస్కూలులో శ్రీమద్భగవద్గీత, కేనోపనిషత్తుపైన వరుసగా ఉపన్యాసాలిచ్చెదరు. 8వేల మంది కూర్చునుటకు వీలుగా వర్షాన్ని తట్టుకోగల పామియానా ఇందునిమిత్తమై ఆస్కూలు ఆవరణలో వేయబడును. ఈఉపన్యాస పరంపరకు జులై 18వ సాయంత్రం 6-30 గంటలకు ఆంధ్రప్రదేశ్ శాసనసభాస్పీకర్ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ప్రారంభోత్సవంజరిపెదరు. స్వామిజీఉపన్యాసాలు ఉదయం 6-30 నుండి 7-30 వరకు కేనోపనిషత్తుపైన, సాయంత్రం 6-30నుండి 8వరకు గీత 18వ అధ్యాయంపైన ఉండగలవు. జులై 12వ తేదీన ఉదయం 11-30 గంటలకు విమానాశ్రయంలో భక్తులు స్వామీజీకి ఘనమైన స్వాగతమిచ్చెదరు.

అస్సాం, త్రిపురా, మణిపూర్ ఉద్యోగులకు మినహాయింపు

కొత్తఢిల్లీ, జులై 10

కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెను తప్పించుటకై ప్రభుత్వానికి ఉద్యోగులకు ఆమోదయోగ్యంగా ఉండు ఫార్ములాను అన్వేషించుటకు జరిగినప్రయత్నం విఫలమైనది.

కేంద్రఉద్యోగుల సమష్టిచర్యసంఘ స్థాయీసమితి సభ్యుడు ఎస్. ఎం. జోషితో ఫెరోజ్‌గాంధీ (ఎం. పి.) ఆర్. కె. ఖదిల్కర్ (ఎం. పి.) సుదీర్ఘసంప్రదింపుల జరిపి వానివివరాల ప్రధాని శ్రీ నెహ్రూకు కేంద్ర కార్మికమంత్రి నందాకు వివరించారు. జీవనవ్యయ సూచికకు కరువుభత్యమును జోడించు క్లిష్టఅంశంపై ప్రతిపాదనలు ఎదురుప్రతిపాదనలు చర్చకు వచ్చాయి

రెండు గంటలుసంప్రదించినమీదట సమష్టిచర్యాసంఘస్థాయీ సమితి తన సమావేశాన్ని రాత్రి పదిగంటలకు వాయిదావేసినది. ఈమధ్య రాత్రి వరకు దానినిర్ణయం వెల్లడికాలేదు.

సమష్టి చర్యాసంఘ స్థాయీ సమితి ఈమధ్య రాత్రి చేసిన తీర్మానంలో కొందరు మిత్రులు సమ్మె నివారణకు చేసిన ప్రయత్నాలు విఫలమైనాయని పూర్వం నిర్ణయింపబడిన ప్రకారం కేంద్ర ఉద్యోగులంతా జులై 11 మధ్యరాత్రి నుండి సమ్మెలో పాల్గొనగలరని తన విశ్వాసాన్ని వ్యక్తం చేసినది.

అస్సాంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితుల దృష్ట్యా మణిపూర్, త్రిపురా, అస్సాంలలోని కేంద్ర ఉద్యోగులు యీ సమ్మెలో పాల్గొనే అవసరం లేదని సలహా ఇచ్చినది.

అస్సాంలో శాంతిపోషణ

సైన్యం వినియోగానికి ఏర్పాట్లు

కొత్తఢిల్లీ, జులై 10

అస్సాంలో భాషా సమస్యపై బయలుదేరిన కల్లోలములవల్ల ఏర్పడిన పరిస్థితిని పరిశీలించి గౌహతినుండి కేంద్ర రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ ఢిల్లీకి తిరిగి వచ్చారు.

రక్షణమంత్రి వెంట కాంగ్రెస్ అధ్యక్షుడుగూడా గౌహతికి వెళ్లారు. వీరు అస్సాం గవర్నర్ మరియు ఆర్థికమంత్రి ఫక్రుద్దీన్ అహ్మద్‌తో సంప్రతించారు. మీనన్ ఢిల్లీకి తిరిగి వస్తూ తేజ్‌పూర్‌లో ఈ ఆందోళనవల్ల కల్గిన నష్టాన్ని పరిశీలించారు.

అస్సాంలో శాంతిభద్రతల పరిపోషణలో సివిల్ అధికారులకు తోడ్పడటానికి సైన్యాన్నినియోగించ ఏర్పాట్లు చేయబడినవి. ఈప్రాంతంలో మార్షల్ లా ప్రకటించేప్రశ్నే లేకున్నా అవసరసమయాలలో రక్షణఉద్యోగులు రాష్ట్రప్రభుత్వానికి తోడ్పడగలరు. సిల్ గురిప్రాంతాన్ని కల్లోల ప్రాంతంగా అస్సాంప్రభుత్వం ప్రకటించనున్నట్టుతెలుస్తున్నది.

సోషలిస్టుపార్టీ సత్యాగ్రహం

దేశమంతటా 20వేల మంది పాల్గొన్నారు

హైదరాబాద్, జులై 10

సోషలిస్టు సత్యాగ్రహము సందర్భముగా దేశమంతటా 2 వేల మంది సత్యాగ్రహము చేశారని పార్టీ కేంద్ర కార్యాలయ ప్రకటనవల్ల తెలియుచున్నది. ఇందులోనుండి 6వేల 5వందల మందికి శిక్ష విధింపబడినదని అందులో తెలుపబడినది.

సైన్యంద్వారా తపాలా పంపిణీకి ఏర్పాట్లు

న్యూఢిల్లీ, జులై 10

కేంద్ర ప్రభుత్వోద్యోగులు తలపెట్టిన సమ్మెజరిగిన పక్షంలో అత్యవసర శాఖల పనులు నిర్విఘ్నంగా కొనసాగుటకు సిద్ధముచేయబడిన వివరాలు ఇప్పుడు వెలువడినవి. తపాలా పంపిణీకి సైనిక తపాలా శాఖవారు సిద్ధంగా వున్నారు ఇండియాలోను, విదేశములలోను ఉన్న ప్రభుత్వోద్యోగులకు పంపదలచిన జాబులను ముఖ్య సివిల్ పోస్టాఫీసులలోను, లేదా సైనిక పోస్టాఫీసులలోను వేయవలసి ఉండును. ఈ విధంగా చేసిన పోస్టు శీఘ్రంగా పంపిణీ జరుగును. అట్టి పోస్టును బజార్లలోని పోస్టుబాక్సులలో వేయగూడదు. ఢిల్లీ నగరానికి ప్రత్యేకఏర్పాట్లు చేయబడినవి.

ఆం ప్ర. సాహిత్య అకాడమీ కృషి

విజయవాడ, జులై 10

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గం నిన్న ఇచ్చట దాని ఉపాధ్యక్షుడు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ అధ్యక్షతన సమావేశమైనది. "వృత్తి పదకోశం", "నన్నయఅక్షర రమ్యత" ప్రచురణ గురించిన కృషిని సమావేశం పరిశీలించినది.

ఈ రెండు గ్రంథాలు వచ్చే ఆగస్టు నెలవరకు వెలువడాలని సమావేశము నిశ్చయించినది. అకాడమీచేత బహుమతులొసగబడిన ఉర్దూ రచయితల పట్టికను సమావేశము ఆమోదించినది. సాధారణ సమాఖ్యకు ప్రతినిధులను పంపుటకు సాహిత్య సంస్థలను పరిగణించాలన్న ఉపసంఘ సిఫారసులను పరిశీలించి తగు మార్పులతో సమావేశము ఆమోదించినది సెప్టెంబరు నెలాఖరు వరకు అకాడమీకి ఎన్నికలు జరుపుటకు తీర్మానించబడినది. వచ్చే అక్టోబర్ వరకు సాధారణ సమాఖ్య నూతన కార్యవర్గము ఏర్పడగలదు

కాంగోలో బెల్జియన్‌ల వధ

తిరుగుబాటుదార్ల ఎదుర్కొనడానికి ఫారాచూట్ సైనికులు

లండన్, జులై 10

కాంగోలోని కటంగా రాష్ట్ర ప్రధాన నగరం ఇలిసాబెత్‌విల్లిలో కాంగో సైనికులు తిరుగుబాటు చేసి ఇద్దరు బెల్జియంఅధికారులను, నల్గురు యూరోపియన్‌లను చంపివేశారు. చంపబడినవారిలో ఒకరు ఇటాలియన్ వైస్ కాన్సల్.

దక్షిణరొడేసియాలోని సాలిస్‌బరి నుండి అందిన టెలిఫోన్‌వార్త ప్రకారము మృతుల సంఖ్య నూరుకు పైగా ఉన్నది.

ఇలిసాబెత్‌విల్లిలో 800 బెల్జియం ఫారాచూట్ సైనికులు నాల్గు విమానాలలో నేటి ఉదయం దింపబడినారు. నాల్గు గంటల తర్వాత తిరుగుబాటుదారులు ఎట్టి రక్తపాతం లేకుండానే లొంగిపోయారు. కొందరు పలాయనమయ్యారు.

గత రాత్రి 200 యూరోపియన్లు వీరిలో చాలామంది బెల్జియన్‌లు యూనివర్సిటీభవనంలోను, ఇతరప్రభుత్వకార్యాలయాలలోను దాగుకున్నారు. తిరుగుబాటు చేసిన కాంగోలి సైనికుల సంఖ్య 300 నుండి 400 వరకు కలదు. లెవల్ బ్రాసింగ్ వద్ద తిరుగుబాటుదారులుండి వచ్చిపోయే కార్లపై కాల్పులు జరిపారు.

అసైన్ రాష్ట్ర ప్రధాన నగరములలోనుండి సాయుధ తిరుగుబాటుదారులు దాడి చేస్తున్నారని పొరాట్రూపర్ల పంపవలసినదిగా సమాచారం పంపబడినది సమితిట్రస్టు ప్రాంతమగురోండాఉరుండిలోగూడా కొట్లాటలు ప్రారంభమైనవి కాంగో నుండి శ్వేతజాతీయులు వెళ్లిపోతున్నారు. ఇప్పటివరకు 400 మంది వెళ్ళిపోయారు. ఉత్తరరొడేసియాలోని కిట్వే, ఎన్‌డోలా, లూన్‌ప్యాలందు కాందిశీకులకై కేంద్రాలు తెరువబడినవి. నాల్గు వందలమంది రైళ్ళలో చేరారు. ఉగండాకు 800మంది కాందిశీకులు వచ్చారు.

జులై 12 వ తేదీన జరిగే విశేషం?

వేచి యుండండి!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధముల శాఖ

రాష్ట్రీయ భారత సైనికకళాశాల ప్రవేశపరీక్ష

న్యూఢిల్లీ, జూలై 10

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ భారత సైనిక కళాశాలకు ప్రవేశ పరీక్ష 1960 సెప్టెంబరు 2,3 తేదీలలో వివిధకేంద్రాలలో జరుగుతుందని రక్షణ మంత్రిత్వశాఖ పత్రికాప్రకటనలో తెలియజేసింది. అందులో వ్రాతపరీక్ష, ముఖాముఖిపరీక్షవుంటాయి. వీటిలో ఉత్తీర్ణులైనవారు నిర్ణీత సైనిక ఆసుపత్రిలో వైద్యపరీక్షకు హాజరవ్వాలి సైనికశాలలలో చేర్చుకునేనిమిత్తం నిర్ణయించబడినఅభ్యర్థులపేర్లు, రాష్ట్రపతిత్వాలకు పంపబడతాయి. రాష్ట్రీయ భారత సైనిక కళాశాల ప్రిన్సిపాలు కళాశాలలో చేరవలసిందని అభ్యర్థులకు తెలియజేస్తారు.

ఇందుకు నిర్ణీత దరఖాస్తుఫారం పూర్తిచేసి రెండుప్రతులను పూర్తిచేసి 1960 ఆగస్టు 1వతేదీలోగా అవి అందేటట్లు తమ తలిదండ్రుల, సంరక్షకుల రాష్ట్రాల ప్రభుత్వాధికారులకు అభ్యర్థుల పంపాలి. 1961 జనవరి 1వతేదీన అభ్యర్థుల వయస్సు 11సంవత్సరాలకు తగ్గరాదు. 12 సంవత్సరాలు నిండరాదు. వయఃపరిమితులు సడలించబడవు.

ఇందుకు సంబంధించిన పూర్తినమూనాన్ని, నిర్ణీతదరఖాస్తుఫారాలను ఆయా రాష్ట్రప్రభుత్వాలకుగానీ డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయభారత సైనికకళాశాల ప్రిన్సిపాలుకుగానీ వ్రాసి పొందవచ్చును.

35మంది ప్రభుత్వోద్యోగులపై నేరారోపణ

ప్రత్యేకపోలీసుశాఖ నెలసరి నివేదిక

న్యూఢిల్లీ, జూలై 10

35మంది ప్రభుత్వోద్యోగులపై లంచాలు పుచ్చుకోవడం, దుష్ప్రవర్తన, మోసం, విశ్వాసద్రోహం—యీనేరాలు మోపబడ్డాయని ప్రత్యేక పోలీసుశాఖ శాలూకు 1960 మేనెల నివేదికనుబట్టి తెలుస్తోంది.

దొంగవ్రాతలు దఖలుపరిచి, లేని వ్యాపారసంస్థలపేరిట దిగుమతి లైసెన్సులు పుచ్చుకున్నారని ఎగుమతి, దిగుమతుల చీఫ్ కంట్రోలరు కార్యాలయంలో అసిస్టెంట్ కంట్రోలరు మీదా, మాజీగుమాస్తామీదా, రెండు దిగుమతి వ్యాపారసంస్థల డైరెక్టర్లూ, మేనేజర్లమీదా నేరంమోపబడింది.

కొనుగోళ్ల నిమిత్తం యివ్వబడిన సుమారు రూ. 1600/-లను దుర్వినియోగపరిచినందులకు ఫీలాయ్‌ఉక్కు యంత్రాగారంలో స్టోర్స్ ఎగ్జామినర్‌పై నేరారోపణ జరిగింది.

14మంది ప్రభుత్వోద్యోగులకూ, 10మంది ప్రైవేట్ వ్యక్తులకూ ఏడేళ్ల వరకూ జైలుశిక్షలూ, మొత్తం రూ. 24,540/-ల జరిమానా విధించారు.

ఒక ఉదాహరణ: భీమాచేసిన బంగీలోని రూ. 80 వేల విలువైన కరెన్సీ నోట్లను దుర్వినియోగంచేసి, దొంగ రసీదు దఖలుపరిచినందుకు ఒకప్రైవేటు బ్రోకరుకు ఏడుసంవత్సరాల కఠిన శిక్ష, పదివేల రూ.ల జరిమానా విధించారు.

రైల్వేటెక్నెట్ల అమ్మకంద్వారా వచ్చినసొమ్ములో పెద్దమొత్తాలను దుర్వినియోగపరిచినందుకు ఒకరైల్వే బుకింగ్ గుమాస్తాకు ఆరునెలల కఠిన శిక్ష, రూ.11వేల జరిమానావిధించారు

ఏడుగురు గెజెటెడ్ ఆఫీసర్లతో సహా 19మంది ఉద్యోగులపై ప్రభుత్వశాఖలద్వారా శిక్ష విధించబడింది. ఎనముందుగురిని డిస్మిస్ చేశారు లేదా బర్తరఫ్ చేశారు లేదా బలవంతాన ఉద్యోగవిరమణ చేయించారు. ఒకరి హోదా తగ్గించారు. మరొకరి ఇంక్రిమెంట్ నిలుపుచేశారు. తొమ్మండుగురిని యితరవిధాలుగా శిక్షించారు.

మనిఆర్డర్లు పుచ్చుకునేందుకూ, ఉత్తరాలను సురక్షితంగా బట్వాడాచేసేందుకూ లంచంపుచ్చుకున్న ఒకబ్రాంచి పోస్టుమాస్టరును ఉద్యోగంలోంచి తొలగించారు. సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ ఇంజనీరు హోదా తగ్గించారు.

దుష్ప్రవర్తన, అవినీతినేరాలకు తగుచర్య తీసుకోవలసిందని ఏడుగురు గెజెటెడ్ ఆఫీసర్లతోసహా 86 మంది ప్రభుత్వోద్యోగులనుగురించి ఆయా ప్రభుత్వశాఖలకు తెలియజేశారు.

ప్రత్యేకపోలీసుశాఖ 118 కేసుల విషయంలో బహిరంగంగావిచారణలు ప్రారంభించింది. వారిలో 24 మందికి గెజెటెడ్ ఆఫీసర్లతోసహా 123 మంది ప్రభుత్వోద్యోగులున్నారు.

గెజెటెడ్ ఆఫీసర్లు వీరు: ఇద్దరు కమీషండ్ ఆఫీసర్లు, ఒకరు రక్షణ మంత్రిత్వశాఖ ఆఫీసరు, ఏడుగురు రైల్వే ఆఫీసర్లు, కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖకుచెందిన ఆఫీసర్లు ఆరుగురూ, రవాణా, కమ్యూనికేషన్‌ల మంత్రిత్వశాఖకుచెందిన ఆఫీసర్లు యిద్దరు, కేంద్ర వాణిజ్య, పారిశ్రామిక మంత్రిత్వశాఖ, ఉక్కు, గనులూ, యింధన మంత్రిత్వశాఖ, పునరావాసకల్పన మంత్రిత్వశాఖ ఆరుగురు

మీకు తెలుసా?

భారతదేశంలో ప్రాథమిక పరపతిసహకార సంఘాల ప్రగతి

1960-61వ సంవత్సరం ఆఖరుకు ప్రాథమిక పరపతి సహకారసంఘాల సభ్యత్వం 150 లక్షలకు పెరగాలని ద్వితీయప్రణాళిక నిర్దేశిస్తోంది

1950-51లో దేశంలో 1.15లక్షల ప్రాథమిక పరపతి సహకారసంఘాలున్నాయి. వారిసభ్యత్వం సుమారు 51 లక్షలు. 1957-58లో ఆసంఘాల సంఖ్య 1.67 లక్షలకూ, సభ్యత్వం సుమారు 102 లక్షలకూ పెరిగింది. 1958-59 నాటి లెక్కలు నిక్కచ్చిగా తెలియవుగాని, పరపతి సహకారసంఘాల సంఖ్య దాదాపు1.75లక్షలకూ వారిసభ్యత్వం దాదాపు120లక్షలకూ పెరిగిందని అంచనా.

పెరుగుదల యీరేటునవుంటే, ద్వితీయప్రణాళిక ఆఖరయ్యేనాటికి వాటిసభ్యత్వం దాదాపు 180 లక్షలు అవుతుంది. అంటే, గ్రామజనాభాలో దాదాపు మూడవవంతు ప్రజలకు వీటి వల్ల ప్రయోజనం చేకూరుతుందన్న మాట. ప్రాథమిక సహకారసంఘాల సంఖ్యకూడా 2లక్షలు మించవచ్చు.

ద్వితీయప్రణాళిక ప్రారంభంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు మొత్తం రు. 49.62 కోట్లు స్వల్పకాలిక, మధ్యకాలిక ఋణాలు మంజూరుచేశాయి. 1960-61 నాటికి ఆమొత్తం దాదాపు రు. 190 కోట్లకు పెరుగుతుంది. స్వల్పకాలిక ఋణాలక్రింద రు. 150 కోట్లూ, మధ్యకాలిక ఋణాలక్రింద రు. 50 కోట్లూ అంటే మొత్తం రు. 200 కోట్లు సొమ్ము మంజూరుచేయబడాలని ద్వితీయప్రణాళిక లక్ష్యం నిర్దేశించింది.

ప్రాథమిక పరపతి సంఘాలు చెల్లించిన వాటాధనం 1950-51లో రూ. 889.97 లక్షలు; 1955-56లో రూ. 1680.88 లక్షలు; 1957-58లో రూ. 2822.27 లక్షలు.

ప్రాథమిక పరపతి సంఘాలు 1950-51లో రు. 2289.72 లక్షల మొత్తాన్ని అప్పుగామంజూరుచేశాయి. 1957-58లో ఆమొత్తం రు. 9608.84 లక్షలకు పెరిగింది.

1957-58వ సంవత్సరం ఆఖరుకు యీసంఘాలబాకీచెల్లించిన మూలధనం మొత్తం రు. 28.22 కోట్లు. అందులో రు. 2.21 కోట్లు రాష్ట్రప్రభుత్వాలిచ్చినా, వారినిధులకూ, నిర్వహణధనానికి శుద్ధ నిష్పత్తి 42శాతం నుంచి 32శాతానికి తగ్గింది.

కేంద్ర ఆర్థిక సహాయసంస్థలపై ఎక్కువగా ఆధారపడే యుద్ధానంతర సంవత్సరాల ధోరణి యింకా కొనసాగుతోంది. 1957-58లో వాటినిర్వహణ ధనంలో 35వవంతు బ్యాంకుల నుంచి అప్పుగాతెచ్చినదే. వ్యవసాయ పరపతి కల్పనతో స్వల్పకాలికఅప్పుల వ్యవస్థకు ప్రముఖపాత్రవున్నా, తదనుగుణ్యంగా వాటాధనంగానూ, డిపాజిట్లుగానూ ఎక్కువమొత్తాలు రావడంలేదని దీనివల్ల తెలుస్తోంది.

విద్యుచ్ఛక్తి వాటర్ వర్క్సుకార్మికుల సమ్మె

జులై 17న లాంఛనప్రాయంగా

హైదరాబాద్ జులై 9

ఈ సాయంత్రం జరిగిన వర్కర్ల సభలో ప్రసంగిస్తూ విద్యుచ్ఛక్తి వాటర్ వర్క్సుశాఖల వర్కర్లయూనియన్ల కార్యదర్శి శ్రీ గోవిందాచారి తమ యూనియన్ల కార్మికులు జులై 17న గాని ఆప్రాంతాలలోగాని ఒకరోజు లాంఛనప్రాయ సమ్మె జరుపగలరని ప్రకటించారు. సభకు శ్రీ బి. ఎస్. మహాదేవసింగ్ అధ్యక్షత వహించారు.

గత రెండేళ్ళుగా కొత్త స్కేళ్ల బకాయిల్ని ఇవ్వడానికి ఒకతేదీ నిర్ణయంచేయకుండా అధికారులు దాటవేస్తున్నందున యూనియన్ల ప్రతినిధులు కన్సిలియేషన్ చర్యల్ని వదులుకున్నారట.

శ్రీ మహాదేవసింగ్ మజార్ సంఘం తరఫున కేంద్రసిబ్బందిసమ్మెను బలపరిచారు.

భార్య హత్యానేరంలో యావజ్జీవ ఖైదుశిక్ష

మహబూబ్‌నగరం, జులై 10

తనభార్య బాలికిష్టమ్మను హత్య చేసిన నేరంపై రాజన్న అనేవానికి మహబూబ్‌నగర్ జిల్లా సెషన్స్ జడ్జి శ్రీ బి. రామలాల్ కిషన్ యావజ్జీవ కారాగార శిక్షను విధించారు.

ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ముద్దాయి తల్లి శీలం మంచిదికాదు. తలితండ్రులతో ఉండటం యిష్టంలేక దూరప్రదేశానికి పోదలచి రాజన్న భార్యమ అడిగాడు. కాని భార్యబాలకిష్టమ్మ అత్తమామలతోనే ఉంటానని అన్నది. అదీగాక ముద్దాయి నేరాన్ని అంగీకరిస్తూ చెప్పిన సాక్ష్యంలో తన భార్యయా తండ్రితో అక్రమసంబంధం ఉన్నట్లు అనుమానం కలిగినదన్నాడు. ఆ అనుమానంపై హత్యజరిగిన నాటికి ముందురోజునతండ్రినికొట్టాడటకూడా.

భార్యనిద్రిస్తుండగా కత్తితోగొంతు కోసి హత్యచేశాడట.

ఉభయ నగరాల లీనీకరణకు బిల్లు

కమ్యూనిస్టు నాయకుడు మహేంద్ర హర్షం

హైదరాబాద్, జులై 10

నిన్న ఆంధ్రప్రదేశ్ అసాధారణ గెజిట్‌లో ప్రకటించబడిన బిల్లు హైదరాబాదు, సికింద్రాబాదు కార్పొరేషన్‌లను ఒకే కార్పొరేషన్‌గా విలీనం చేయడానికి ఉద్దేశిస్తున్నది.

ఆశయాలు, కారణాలు వివరిస్తూ ప్రభుత్వం కొంత కాలముగా ఉభయ నగరాల ప్రజల ప్రయోజనార్థం రెండు కార్పొరేషన్‌లనూ విలీనంచేసి గ్రేటరు హైదరాబాద్‌ను రూపొందించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు పేర్కొన బడింది. అవిధంగా కార్పొరేషన్ పరిపాలనలో సామర్థ్యాన్ని పెంచి పొదుపుచేసి పౌరులకు ఇంకా ఎక్కువ సౌకర్యాలు కలిగించాలని సంకల్పించబడింది.

ఈబిల్లు ప్రకారం విస్తృత కార్పొరేషన్‌లో 94గురు -హైదరాబాద్ 66, సికింద్రాబాద్ 28 — కౌన్సిలర్‌లు ఉంటారు. ఒకే కార్పొరేషన్ ఏర్పడిన తరువాత అవసరమయితే ఒకప్రకటన ద్వారా ప్రభుత్వం కౌన్సిలర్లసంఖ్యను — 100 కు ఎప్పుడూమించకుండా— పెంచవచ్చును.

ఉభయనగరాల మొత్తం జనాభా 15 లక్షలు—హైదరాబాద్ 12లక్షలు, సికింద్రాబాద్ 3 లక్షలు — ఉంటుందని అంచనా వేయబడింది.

లీనీకరణను కోరుతూ హైదరాబాద్ కార్పొరేషన్ ఒకతీర్మానాన్ని ఆమోదించింది. సికింద్రాబాద్ కార్పొరేషన్ లీనీకరణనువ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది.

కమ్యూనిస్టు నాయకుని హర్షం

ఉభయ నగరాల కార్పొరేషన్‌ల లీనీకరణప్రతిపాదనను హర్షిస్తూ హైదరాబాద్ నగర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి శ్రీ కె.ఎల్. మహేంద్ర ఒకప్రకటన చేశారు. ఈ లీనీకరణప్రతిపాదన కొన్నిదురభిప్రాయాలకు దారితీసినందుకు విచారాన్ని వ్యక్తంచేశారు లీనీకరణ వలన టోల్ పన్ను తప్పుతుందనీ, కేంద్ర ప్రభుత్వోద్యోగులు ముప్పుగురువారి ప్రయోజనం ఉంటుందనీ ఆయన పేర్కొన్నారు.

సిద్ధాంత భౌతిక విజ్ఞాన పరిశీలనలు

నివేదిక ప్రచురణ

న్యూఢిల్లీ, జూలై 10

సిద్ధాంత భౌతిక విజ్ఞాన పరిశీలనలు గురించి భారతదేశంలో తొలిసారిగా ముస్సోరీలో నిర్వహించిన వేసవి పాఠశాల కార్యకలాపాలను వివరిస్తూ కేంద్ర వైజ్ఞానిక పరిశోధనలు సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక నివేదికను ప్రచురించింది. అని వేదిక రెండు సంపుటాలలో వెలువడింది.

గత దశాబ్దంలో భారతదేశంలో సిద్ధాంత భౌతిక విజ్ఞానవిషయంలో జరిగిన పరిశోధనలూ, ప్రపంచంలోని పలుప్రాంతాలలో రూపొందించబడిన ఆధునిక పద్ధతులూ వాటిలో పొందుపరచబడ్డాయి. అణువిజ్ఞాన శాస్త్రపరిశోధనలతో సంబంధంగల యువవిజ్ఞాన శాస్త్రవేత్తలకూ, విద్వాంసులకూ, సంస్థలకూ యీనివేదిక విశేషంగా ఉపయోగపడగలదు.

ఆపాఠశాలకు దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు సుమారు 58గురు ప్రతినిధులుగా వచ్చారు. ఆ పాఠశాల ప్రముఖశాస్త్రవేత్త ఆచార్య ఎస్. ఎన్ బోస్ అధ్యక్షతక్రింద నాలుగు వారాలపాటు నిర్వహించబడింది. ప్రధానమంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ వేసవిపాఠశాలనిర్వహణ సిద్ధాంతాన్ని మెచ్చుకుంటూసందేశం పంపారు. కేంద్ర వైజ్ఞానిక పరిశోధనలు, సాంస్కృతికవ్యవహారాలమంత్రి డా॥ హుమాయూన్‌కబీర్ అనివేదికకు తొలిపలుకువ్రాశారు. ఒక్కొక్క సంపుటం వెల భారతదేశంలో 5 రూపాయలు. ప్రతులుకావల్సిన వారు:-పబ్లికేషన్ యూనిట్, మినిస్ట్రీ ఆఫ్ సైంటిఫిక్ రిసెర్చి అండ్ కల్చరల్ అఫైర్సు, ఇ-29, సెం,8,కర్జన్ రోడ్డు, ఎ-బారక్సు, న్యూఢిల్లీ, చిరునామాకు వ్రాయాలి.

ఖమ్మంలో వర్షాలకు చెర్వులకు గండ్లు

ఖమ్మం, జులై 10

ఖమ్మంలో జూలై 7 న 5 దుక్కుల వర్షం పడిన ఫలితంగా రాయపట్నంలోని పూరచెరువు, ఎర్రుపాలెంలోని అలుగువాగులకు గండ్లు పడినవి. గత వారంలో మధిరలో వాగ్లు చెర్వులకు గండ్లుపడినవి. జిల్లాలోని నీటి వనరులన్నిటా నిండా నీరున్నది,

నాగార్జునసాగర్ ప్రాజక్టు నిర్మాణ ప్రగతి

న్యూఢిల్లీ, జులై 10

ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆనకట్టపునాదికిసంబంధించిన త్రివ్వకం పని ఇంచుమించు అంతా పూర్తిఅయింది కుడి, ఎడమ కాలవల త్రివ్వకంపనిలో నూరింట 88 వంతుల పైచిల్కు పూర్తి అయింది.

ఈ ఆనకట్ట హైదరాబాదుకు సుమారు 100 మైళ్ళలో ఉన్న నందికొండ గ్రామంవద్ద నిర్మించబడుతోంది దీనిని రాతితో కడుతున్నారు. దీని నగటు ఎత్తు 302 అడుగులుఉంటుంది. నిడివి 8,900 అడుగులు. ఇందులో 1800 అడుగుల మేర స్పిల్వేఉంటుంది. ఆనకట్టసైట్ గ్రానిట్ నమూనాలో ఉంటుంది. రిజర్వాయరులో 54.5 లక్షల ఎకరాల అడుగుల నీటిని నిలవ చేయవచ్చును. రిజర్వాయరు విస్తీర్ణం 78.66 చదరపు మైళ్ళకు పైగా ఉంటుంది. కృష్ణానదికి అడ్డగిన ఇద్దరిన నిర్మిస్తున్న రెండు ఇరిగేషను కాలువల మొత్తం నిడివి 249 మైళ్ళు. ఆంధ్ర ప్రదేశ్‌లోని 20.6 లక్షల ఎకరాలు వీటిక్రింద సాగు అవుతాయి దీనివల్ల వ్యవసాయోత్పత్తి సుమారు 8 లక్షల టన్నులు పెరుగుతుంది.

ద్వితీయ ప్రణాళికలో రు. 88 కోట్లు కేటాయింపు

ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమము పురోగతిని గురించి కాజాగా సేకరించిన వివరాలను బట్టి, పునాదులలో మొత్తం 847.80 లక్షల ఘనపుటడుగుల మట్టి పని సాగించవలసి ఉండగా యీపుడు మే మాసాంతంనాటికి 881.10 లక్షల ఘనపుటడుగుల మట్టి పని పూర్తయింది. ఆనకట్టవద్దమొత్తం 1696 లక్షల ఘనపుటడుగుల రాయి కాంక్రీటు పని జరుగవలసి ఉండగా అందులో నూటికి సుమారు 24 వంతులందే 410 లక్షల ఘనపుటడుగుల రాయి కాంక్రీటు పని జరిగింది.

రెండు కాల్వల ద్వారా సంబంధించిన త్రివ్వకం పని 98 మైళ్ళ మేర పూర్తి అయింది. మొత్తం జరుగవలసిన 818.20 కోట్ల ఘనపుటడుగుల మట్టి పనిలో రమారమి 238 శాతం అంటే 72.60 కోట్ల ఘనపుటడుగుల మట్టి పని పూర్తి అయింది. రెండు కాల్వలకు సంబంధించిన సమగ్రమైన పరిశీలనలు కూడా పూర్తి కావస్తున్నాయి. 3000 అడుగుల నిడివి, 40 అడుగులు - ఎత్తుగల మళ్ళింపు ఆనకట్టను నిర్మించడం, 76 మైళ్ళ పొడవున ఆనకట్టవద్దకు రోడ్లు, ఒక బ్రిడ్జి, మాచెర్లనుంచి ఆనకట్టస్థలంవద్దకు రైలు మార్గం వేయడం మొదలయిన పనులు కూడా కొంత కాలం క్రిందట పూర్తి అయినాయి.

దానికితోడు ఆనకట్ట వద్ద కార్మికుల నిమిత్తం స్థిర నివాస సౌకర్యాలు ఒక ఆసుపత్రి భవనం, వసతి వాడలు మొదలయిన నిర్మించబడ్డాయి. ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాన్ని 1956 ఫిబ్రవరిలో ప్రారంభించారు. తృతీయ వార్షిక అంతంలోగా ప్రాజెక్టు పూర్తి కాగలదని అనుకుంటున్నారు.

జాబుల వర్గీకరణకు యంత్రాలు

లండన్, జులై 10

జాబులన్నింటినీ పూర్తిగా యంత్రాలే వర్గీకరించే ప్రయోగం బెడ్‌ఫర్డ్‌షైర్ లోని లూటన్ పెద్ద పోస్టాఫీసులో జూన్ 21 వ తేదీన ప్రారంభమయినది. ప్రపంచమంతటలోనూ లిటన్‌లోనే మొదటిసారిగా యీ ప్రయోగం జరుగుతుందని అసిస్టెంట్ పోస్టుమాస్టర్ జనరల్ మిస్ మెర్యెన్ వైక్ చెప్పారు. జాబుల వర్గీకరణకు లిటన్‌లోఇప్పుడు పౌ1,60,00,000లు అవుతుంది. యంత్రాలను వాడుకలోకి తీసుకువస్తే యీ ఖర్చు చాలా వరకూ తగ్గుతుంది. అసలు మనుషులు అవసరం లేకుండా యీ పని జరిపించడము తుది లక్ష్యమని వివరించారు.

పోస్టు చేసే జాబుకు మొదట తేదీ ముద్ర వేస్తారు. అతరువాత యంత్రంలోకి పంపిస్తారు. ఈబోర్డుదగ్గర ఆపరేటర్ ఉంటాడు. కిటికీవంటి దానిలోంచి జాబులను చదువుతాడు.

ఆహార, వ్యవసాయ, కార్మికశాఖా మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి జూలై 18 వ తేదీ ఉదయం 5-30 గంటలకు బయలుదేరి వరంగల్ జిల్లా నరసంపేట తాలూకా నెక్కొండ వెళ్లి అదేరోజు సాయంత్రం 6 గంటలకు రాజధానికి తిరిగి వస్తారు.

గోలకొండ గ్రంథాలయము

అంకితం

(జాతీయ రూపకం), రచన: శ్రీ పైడిపాటి సుబ్బరామశాస్త్రి, ప్రతులకు భారతీయ నికేతన్, మారుతీనగర్, విజయవాడ-3, 118 పేజీలు, మూల్యం రు. 1-50 న.పై.

కవిసమ్రాట్, కవిరాజ విరుదాంకితులయిన జాతీయకవి శ్రీసుబ్బరామశాస్త్రి యీపుస్తకంద్వారా రంగస్థల ప్రదర్శన కనుపైన ఒక చక్కని సాంఘిక నాటకాన్ని ఆంధ్రదేశానికి సమర్పించారు.

దేశపునర్నిర్మాణానికి జీవితాన్ని అంకితంచేయాలని యీనాటకంద్యోతిస్తుంది. ఇటీవలి పంచాయతీ సమితులతోసహా ప్రణాళిక, దేశాభివృద్ధి కార్యక్రమాల్ని ప్రస్తావిస్తూ పద్యాలు లేకుండా పరిమితమైన పాటలతో శ్రీసుబ్బరామశాస్త్రి ప్రణాళిక ప్రచారానికి వినియోగపడేటట్లు యీ నాటకాన్ని రూపొందించారు అందుకు తగినట్లుగా వివిధ పాత్రల్ని సమకూర్చారు. రాధమురళిని స్మరించడంతో ప్రారంభమైన నాటకం వీరు పెద్దల అంగీకారంతో కట్నాలులేని ప్రేమ వివాహంచేసుకోవడంతోముగుస్తుంది.

ఇందులో శ్రీసుబ్బరామశాస్త్రిగేయాల్ని ప్రత్యేకంగా పేర్కొనవలసిఉంది

చీకటి-వెలుగులు

నవల, రచన: శ్రీ కొండపల్లి వెంకటశేషగిరిరావు, ఉపశీర్షిక ప్రచురణ. శాంతి నగరం (అనంతగిరి), హుజూర్‌నగర్ తాలూకా, నల్లగొండజిల్లా. 105 పేజీలు వెల రూపాయి. ప్రతులకు కారంశెట్టి చినవరసయ్య న్యూస్ ఏజంట్ అండ్ బుక్ సెల్లర్, ఖమ్మం అని వ్రాయాలి.

రచయిత తొలి ప్రయత్నమైనా "చీకటి-వెలుగులు" కరణ రసభరితమైన చక్కని కథ అని చెప్పవచ్చును. సాంఘిక జీవితాల్లో తరతెత్తి విభిన్న మనస్తత్వాలు యిందులో మనోరంజకంగా చిత్రించబడినవి.

తెలంగాణ గ్రామాలనుండి యిట్టి నవలలు ప్రచురించబడుతుండటము హర్షణీయం. పాఠకులు ఆదరించగలరనే ఆశిస్తున్నాం.

అమరశిల్పి

నక్షత్ర, రచయిత: శ్రీ మక్కాకాజ పేట వెంకటాచారి, ప్రకాశకులుపారిశ్రామిక ఆర్టుసొసైటి, బి 10-144 గౌలిగూడా, హైదరాబాద్ వెల 10 అణాలు

ప్రేమకూ, కళకూ; ఆశయాలకూ ఆచరణకూ మధ్యగల అంతరాలు అనివార్యతా సంబంధాలు ప్రతిభావంతంగా యీనవలలో చిత్రించబడినవి. కల్పనలు అనల్పంగా ఉన్నాయి. ఈనవలలో వాడిన చక్కనిభాష పాఠకుణ్ణి నవల తుదివరకూ చదివిస్తుంది తెలంగాణలో నవలా సాహిత్యంలేని లోటునుయిట్టి నవలలు తీర్చగలవని ఆశిస్తున్నాం.

అప్పారి బకాయదార్లకు మరో అవకాశం

హైదరాబాద్, జులై 10

1959 అక్టోబర్ 1వ తేదీవరకు పెనాల్టీలను కలుపుకొని రు. 5 వేలకు తక్కువ బకాయలున్న అప్పారి కంట్రాక్టర్లకు ఈదిగువ సూచించిన విధముగా కన్సెషన్ ఇస్తూ ప్రభుత్వము ఇంకొక అవకాశాన్ని వారికి కలిగించినది. ఈ బకాయలను మూడు వార్షిక అంచెలపైన చెల్లించవచ్చు మొదటి చెల్లింపు 1960 నవంబరు 30న, రెండవదాన్ని 1961 నవంబరు 30న, మూడవదాన్ని 1962నవంబరు 30న తగ్గ పెనాల్టీలతో తీసికొనబడును. మొదటి రెండు అంచెలను సకాలములో చెల్లించిన యెడల అంచెలలో తగు తగ్గింపు చేయబడుచేగాక మొత్తము పెనాల్టీలు 1962 నవంబర్ 30వ తేదీన తుది వార్షిక అంచె చెల్లింపు వేళ రద్దు చేయబడును.

పారుడువ్యాధినిర్మూలన పథకం

మూడు జిల్లాలలో అమలు

హైదరాబాద్, జులై 10

నిజామాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాలలో 1930 జూన్ నెలలో పారుడువ్యాధి నిర్మూలన పథకం అమలు జరిగినది. ఈ పథకం క్రింద పనిచేస్తున్న ప్రత్యేక జట్టులవారు ఈ కాలములో 2,21086 పశువులకు టీకాలు వేశారు. వీటితో కలుపుకొని ఈ ప్రాంతంలో ఇప్పటివరకు మొత్తం 26,92,118 పశువులకు టీకాలు వేయడం జరిగింది.

నిజామాబాద్ జిల్లాలోని బాన్స్‌వాడ, ఆర్మూరు, బోధన్ యెల్లారెడ్డి తాలూకాలలోనూ, మెదక్ జిల్లాలలోని మెదక్, జోగిపేట, సంగారెడ్డి తాలూకాలలోనూ, హైదరాబాదు జిల్లాలోని వికారాబాదు, ఇబ్రహీంపట్నం తాలూకాలలోను యీ నెలలో యీ పని జరిగింది.

రాష్ట్రంలో చెఱకు పంట

హైదరాబాదు, జులై 10

తుది అంచనా నివేదికనుబట్టి 1959-60లో రాష్ట్రంలో చెరకు 188200 ఎకరాల విస్తీర్ణంలో పండించినట్టు లెక్కకట్టబడింది. పోయిన యేడాది యీ పంట క్రిందవున్న భూమి విస్తీర్ణం 181400 ఎకరాలు. గత ఐదు సంవత్సరాల సగటు విస్తీర్ణం 178300 ఎకరాలు. ఈ అంకెలను బట్టి యీ యేట విస్తీర్ణం నిరుటికంటె 1 శాతమూ గత ఐదు సంవత్సరాల సగటు విస్తీర్ణంకంటె 6 శాతమూ ఎక్కువయినట్టు వెల్లడవుతున్నది.

విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, మెదక్ జిల్లాలలో నిరుటికంటె తక్కువ విస్తీర్ణంలో వేయటం జరిగింది. నెల్లూరు, నల్గొండ, వరంగల్లు, ఖమ్మం, కరీంనగరం జిల్లాలలో యీ పంట క్రిందవేసే భూమి విస్తీర్ణం గణించతగినది గాదు.

పోతే ఆంధ్రప్రాంతంతో పోల్చితే యీ పంట తెలంగాణా ప్రాంతంలో చెప్పుకోదగినదిగాదని తేలుతుంది. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరులు, కృష్ణా,చిత్తూరు, నిజామాబాదు జిల్లాలలో ఇది ముఖ్యమైనపంట. రాష్ట్రంలో పండేమొత్తం పంటలో 88 శాతం యీ జిల్లాలలోనే పండించబడుతున్నది.

పంటకోతలప్పుడు చేసిన ప్రయోగాల ఫలితాలు ఆధారంగా తీసుకుంటే 1959-60లో దెల్లం ఉత్పత్తి 627000 టన్నులుంటుందని అంచనా ఇదే నిరుటి ఉత్పత్తి 660600టన్నులు పోయిన ఐదేండ్ల సగటు ఉత్పత్తి 590900 టన్నులు. దీన్నిబట్టి యీ సంవత్సరం ఉత్పత్తి నిరుటిమీద 5 శాతం తక్కువగానూ, గత ఐదేండ్ల సగటు ఉత్పత్తిమీద 18 శాతం ఎక్కువగానూ వుంటుందని తెలుస్తున్నది

ప్రభుత్వ స్కూలరు మిప్పులకు దరఖాస్తులు

విద్యాసంస్థలలో ప్రవేశాలు, ఐదిలీ సర్టిఫికెట్లు మొదలయిన విషయాలు పూర్తి చేసుకున్న తరువాతనే ఆయా సంస్థల అధిపతులు స్కూలర్ మిప్పుల పనిని చేపట్టేందుకు వీలుగా స్కూలర్ మిప్పులపంపే గడువును పొడిగించమని కొన్ని అభ్యర్థనలు ప్రభుత్వానికి వచ్చాయి. అందుచేత నిమ్నజాతులు, నిమ్నతెగలు, వెనుకబడిన తరగతులు, ఇతర మతం పుచ్చుకున్న హరిజనులు స్కూలర్ మిప్పులకు దరఖాస్తులను సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టరుకు లేక ఇతర నియమిత అధికారులకు పంపుకునేందుకు ఆఖరు తేదీని, ఇంతకు ముందు వెలువడిన ఆదేశాలకు సవరణగా, జూలై 31వ తేదీకి పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.——

కృష్ణానది నీటిమట్టం బాగా పెరిగే సూచన

విజయవాడ, జూలై 9

కృష్ణానది ఆనకట్టమీద నీటిమట్టం 7.00 అడుగులు వున్నది. ఈ మట్టం ఇంకా పెరిగేసూచన నేడుయిక్కడకు వచ్చింది. కృష్ణాతూర్పుడెల్టా మెయిన్ కాలవలో 12.8 అడుగులు, రైవస్ కాల్వలో 10.7 అడుగులు, ఏలూరు కాల్వలో 11.8 అడుగుల నీరువున్నది. కృష్ణానదిలో నీరు ఒక్కరోజులో ఒకఅడుగు పెరిగింది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వ ఎన్. జి. ఓలను ఇటీవలజరిగినప్పుడుశ్రీఎస్.సత్యనారాయణ ప్రసంగించారు రైల్వే,తపాలా శాఖలవారి నిస్సమ్మె సఫలయ ప్రదం చేయవల్సిందిగా ఆయన ఉద్బోధించారు. శ్రీ వి. టి. సింగ్ అధ్యక్షత వహించారు.

విజయవాడ ఆసుపత్రి

నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మంత్రి విజయవాడలో 5 వందల పడకలుగల ఆస్పత్రిని 28 లక్షల్రూపాయలవ్యయముతో నిర్మించడానికి చూపుతున్న ఉత్సాహంపట్ల శ్రీ పి. వి. జి. రాజును అభినందిస్తూ స్థానిక కమ్యూనిస్టు పార్టీ ఒకతీర్మానం చేసింది. శ్రీ తడపనేని వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు

ఈ ఆస్పత్రి పట్టణంలో ఏ కృష్ణలంకలోనో నిర్మించాలని వారు కోరారు.

పురపాలక సంఘ ప్రత్యేకాధికారి మురికిపేట నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను వాసనాలము అయిపోయేవరకు ఆపమని వారు మరొక తీర్మానం చేశారు.

పట్టణంలో చౌకడిపోలు పెట్టాలనీ, రాత్రికళాశాల ప్రారంభించాలనీ, స్త్రీలకళాశాల ప్రారంభించాలనీ, స్త్రీలకళాశాలనూ నూతన ఆస్పత్రికి ఒక వైద్యకళాశాలను అనుబంధంగానూ ఏర్పాటుచేయాలనీ ప్రభుత్వాన్ని ఈ కమిటీ కోరింది. ఇంజనీరింగు కళాశాలను కూడా ఏర్పాటు చేయమన్నది. (స్వ. వి.)

తీవ్రర

కావలెను

మా ప్రెస్సులో పనిచేయుటకు మిషన్ బాయ్‌లు, తెలుగు కంపాజిటర్లు కావలెను. పనితనము, అనుభవమునుబట్టి వేతనము నిర్ణయింపబడును. దరఖాస్తులు 16 జూలై 1960 వరకు యీ క్రిందివారికి పంపుకొనవచ్చును.

మేనేజరు,
గోలకొండ పత్రిక,
హైదరుగూడ, హైద్రాబాదు.

అమృతాంజనము

నొప్పులతో కూడిన వ్యాధులు ముదరకముందే కుదురుతాయి



అమృతాంజనము బాధను నివారించడమే గాక బాధ కారణాన్ని కూడా నిర్మూలిస్తుంది. ఇది రక్త సంచయాన్ని శమింపజేసి రక్త ప్రవాహాన్ని క్రమపరచుటకు ఉపకరించును.
ప్రతిసారి దీనిని అతి కొంచెమే ఉపయోగించవలసి ఉండడంచేత ఒక బుడ్డి నెలలతరబడి వస్తుంది.

"బొంబాయి-1. కలకత్తా-1. న్యూఢిల్లీ"

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

టెండర్ నోటీసు

దిగువ సూచించిన పనులకు పి. డబ్ల్యు. డి. మరియు ప్రఖ్యాత సంస్థలలో రిజిష్టరైన కంట్రాక్టర్లనుండి దిగువ సంతకముచేసినవారు సీల్డు టెండర్లు కోరుచున్నారు.

క్రమ సంఖ్య	పని పేరు	అంచనా ఖరీదు	పనియొక్క అంచనా ఖరీదులో 1 శాతం డిపాజిట్ పైకము	టెండరు ఫారం ఖరీదు	పని పూర్తి చేయవలసిన గడువు
1.	రామగుండం రైల్వేస్టేషన్ నుండి గోదావరిఖనివరకు రైల్వే సైడింగ్ (0 మైలు నుండి 6 మైలు వరకు) మొదటి సెక్షనుకు భూమి చదును పని యేర్పాటు.	3,68,000/-	3,680/-	5/-	టెండరు అంగీకరించిన తేదీ తరువాత 9 మాసములు
2.	రామగుండం రైల్వేస్టేషన్ నుండి గోదావరిఖనివరకు రైల్వే సైడింగ్ (6 మైలు నుండి 9 వరకు) మొదటి సెక్షనుకు భూమి చదును పని యేర్పాటు.	6,84,000/-	6,840/-	5/-	టెండరు అంగీకరించిన తేదీ తరువాత 15మాసములు

1. టెండర్లు 1-8-1960 మధ్యాహ్నము 12-0 గం॥ వరకు అంగీకరించబడును.
2. టెండర్లు 4-8-1960 సా॥ 4-0 గం. తెరువబడును.
3. పైన పేర్కొనబడిన రెండు అంశములకు విడిగా టెండర్లు పంపవలెను.
4. పంపించేటెండర్లు అన్నివిషయములు పూర్తి చేసి పంపవలెను. అసంపూర్తి టెండర్లు నిరాకరించబడును.
5. టెండరు ఫారము, క్వాంటిటీలు అండ్ స్పెసిఫికేషనుల షెడ్యూళ్లతో పే మాస్టర్ సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్. కొత్తగూడెం కాలరీస్ P.O. లేక ఏజంట్ కాండూరీ కాలరీస్, బెల్లంపల్లి P.O. మరియు సెక్రటరీస్, సింగరేణి, కాలరీస్ కంపెని లిమిటెడ్, మెహర్ మంజిల్ రెడ్ హిల్స్, ఖైరతాబాద్ P.O. హైదరాబాదుదక్కన్-4లో నుండి ఆఫీసు పని దేయు రోజులలో సా. 2-0 నుండి 5-0 గం. మధ్యన పైన పేర్కొనబడిన పనికి ఎదురుగా చూపబడిన ఖరీదు చెల్లించి పొందవచ్చును.
6. కోరబడిన డిపాజిట్ పైకమును, పే మాస్టర్ సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్, కొత్తగూడెం కాలరీస్ P.O. లేక ఏజంట్ కాండూరు కాలరీస్ బెల్లంపల్లి P.O. మరియు సెక్రటరీస్ సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్ మెహర్ మంజిల్ రెడ్‌హిల్స్, ఖైరతాబాద్ PO హైదరాబాద్, దక్కన్-4 (ఆం.ప్ర) వారి కార్యాలయములలో నగదు లేక గవర్నమెంటు సెక్యూరిటీలలో చెల్లించవలెను.
7. గెలుపొందిన టెండరుదారు అగ్రిమెంటుబాండుపై సంతకంచేయు సమయమున పనియొక్క అంచనా మొత్తములో 1 శాతము అదనపు డిపాజిట్ పైకము చెల్లించవలెను.
8. ఈపని సెంట్రల్ రైల్వే స్పెసిఫికేషనులప్రకారము నిర్వహించబడవలెను.
9. ఏవిధమైన కారణములుచూపక, ఏటెండరునయిన పూర్తిగానాని లేక కొంత భాగముకాని లేక అన్ని టెండర్లను అంగీకరించుటకు లేక నిరాకరించుటకు దిగువ సంతకము చేసినవారు హక్కుగలిగి యున్నారు.

జనరల్ మేనేజర్,
సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్,
కొత్తగూడెం కాలరీస్, P.O. (ఆం. ప్ర.)

రేడియో కార్యక్రమం

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

మంగళవారం జులై 12

ఉ॥ 6-30 సుప్రభాత్, కార్యక్రమ వివరణ, 6-40 భక్తిరంజని: (విజయవాడ నుండి రిలే), 7-00 తె-వా. 7-15 విజయవాడ వలె, 7-45 సంగీత శిక్షణ, 8-00 ఆం-వా, 8-15హిం-వా 8-30 కమలా బాయి పోత్‌దార్, 8-45 వ్యవసాయ సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము కోటివిద్యలు నాటిక, 1-00 ఆంధ్రోనిమాత్యూస్: వయొలిన్, 1-15 కమలాబాయి పోత్‌దార్, 1-30 వాద్యగోష్ఠి: నిలయవిద్వాంసుడు 1-50 తె-వా, 2-00రసూలన్ బాయి, హీరాబాయి బరోడేకర్: తుమ్రీ, 2-10 ఉ-వా, 2-20 ఉన్నత పాఠశాలలకు (ఉర్ దూ), 2-50వాతావరణసూచన ప్రసారసమాప్తి.

3-45 ఉన్నత పాఠశాలలకు, 4-15 వ్యవసాయ సమాప్తి.

సా॥6-00 స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 కన్నడ శ్రోతలకు, 7-00తె-వా, 7-15 మరాఠీ శ్రోతలకు, 7-30 సాహిత్యనందిని, 7-45 శ్రోతల ఉత్తరాలకు జవాబులు (ఉర్ దూ), 7-50 ప్రసంగము. 8-00 శ్రోతలు కోరిన పాటలు, 8-30 ఆంధ్రోనిమాత్యూస్: వయొలిన్, 8-45 కమలాబాయి పోత్‌దార్, 9-00 ఆం-వా, 9-15 ఉ-వా. 9-30 శకాబ్ రాముడు రేడియో సంక్షిప్తశబ్దచిత్రం 10-30 వాతావరణసూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాదు-బి

42 02 మీ (7140 కిలోసై)

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎవలె. 8-45 ప్రసార సమాప్తి.

30.96 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైద్రాబాద్ ఎ వలె, 2-10 గాత్రసంగీతం, 2-20 ఎస్. శ్రీనివాస శర్మ: వయొలిన్, 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

3-45 హైద్రాబాద్ ఎ వలె, 4-15 వ్యవసాయ సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥6-00 హైద్రాబాద్ ఎవలె 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా 7-15 గ్రామస్థుల కార్యక్రమము ద్వితీయ వ్యవసాయ సప్తాహం రేడియో నివేదిక, 7-30 హైదరాబాద్ ఎ వలె, 7-45 శాస్త్రీయ సంగీతము, 8-10 హైద్రాబాద్ ఎ వలె, 9-15 ఎస్. శ్రీనివాసశర్మ: వయొలిన్ 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, 6-40 భక్తిరంజని: అన్నమాచార్య సంకీర్తనలు, 7-00 తె-వా, 7-15 పి. భువనేశ్వర్ రావు: వీణ, 7-45 సంగీతశిక్షణ, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ప్రసారసమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము (హైద్రాబాద్ నుండి రిలే), 1-00 పేరంటము స్త్రీల కార్యక్రమం, 1-30 లలిత సంగీతం, 1-50 తె-వా, 2-00 ప్రసార సమాప్తి.

3-30 వీణ: నిలయ విద్వాంసుడు, 3 45 ఉన్నత పాఠశాలలకు (హైద్రాబాద్ నుండి రిలే), 4-15 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయవార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము ద్వితీయ వ్యవసాయ సప్తాహం, రేడియో నివేదిక, 7-30 సాహిత్య నందిని (హైద్రాబాద్ నుండి రిలే), 7-45 బొమ్మ రిల్లు పాటలు, 8-00 పి. భువనేశ్వర్ రావు: వీణ, 8-30 కల్పలత-శ్రోతలు కోరిన పాటలు, 9-00 ఆం-వా, 9-15 లలిత సంగీతం: వాతావనకుమారి. 9-30 రేడియో సంక్షిప్త శబ్దచిత్రం (హైద్రాబాద్ నుండి రిలే). 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

వెండి బంగారు ధరలు

సముద్రాల రాఘవులు గారి చంద్రయ్య దుకాణం

సిద్దంబర్ బజార్, ఫోన్ నెం. 4890

హైదరాబాద్, జూలై 9

బంగారం	128-12-0
ఆర్నోక్ చీఫ్	129-0-0
నవరత్న	87-0-0
వెండి 100 తు॥	216-0-0
చిల్లర తు॥ 1 కి	2-8-0

చిన్నగింజధాన్యం

హైద్రాబాద్, జూలై 10

ఆంధ్రప్రదేశ్‌లో 1959-60వ సంవత్సరంలో సుమారు 26,07,900 ఎకరాలలో చిన్నగింజధాన్యం వేయబడ్డట్లు అంతిమఅంచనా- నివేదికనుబట్టి తెలుస్తున్నది. క్రిందటిసాదాది సుమారు 26,12,800 ఎకరాలలోనూ, గడిచిన అయిదుసంవత్సరాలలో సగటున 28,9200 ఎకరాలలోను యీపైరు వేయడమైనది. అంటే ఈయేడు పైరు క్రిందవున్న భూమివిస్తీర్ణం నిరుటి కంటె సూటికి 0 2 వంతులు గతఐదు సంవత్సరాలకంటే 8వంతులు తక్కువ అన్నమాట.

శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు నెల్లూరు, కర్నూలు, హైదరాబాదు, కరీంనగరం, ఆదిలాబాదు జిల్లాలలో యీపైరు యీసారి మొదటికంటె విస్తీర్ణంలో వేశారు. కాగా వరంగల్ జిల్లాలో నిరుడువేసినంతవిస్తీర్ణంలోనే వేయబడగామిగతజిల్లాలలో తక్కువ విస్తీర్ణంలో వేయబడినది

గుంటూరు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప, మహబూబ్‌నగరం జిల్లాలలో యీధాన్యంఎక్కువగా పండించబడుతుంది. రాష్ట్రంమొత్తంలో యీయేడు ఈపైరువేసిన విస్తీర్ణంలో సుమారు సూటికి 88వంతుల విస్తీర్ణం యీజిల్లాలదే.

ఈయేటిఉత్పత్తి 42,70,00 టన్నులకు అంచనా కట్టబడినది. దీనిని నిరుటిఉత్పత్తిఅంచనాఅయిన891,000 టన్నులలోనూ, గతఅయిదేళ్ళ సగటు ఉత్పత్తి అయిన 415,600 టన్నులలోనూ పోల్చిచూచినప్పుడు ఇదివీటికంటె వరుసగా సూటికి 9వంతులు, 8 వంతులఅధికమైనట్లువిశదమవుతుంది రాష్ట్రంలో యీపైరుపరిస్థితి సాధారణంగా సంతృప్తికరంగావుంది అయితే అనంతపురంజిల్లాలోమాత్రం కొన్ని ప్రదేశాలలో పైరుకి తెగుళ్ళు తగిలినట్లు తెలుస్తున్నది.

పారిశ్రామికోత్పత్తులు

ఆంధ్రప్రదేశ్‌లో 1960 ఏప్రిల్ నెలలో జరిగిన వివిధపారిశ్రామికోత్పత్తులవివరాలుదిగువ పేర్కొనబడినవి:-

నూలుదారం 32,09 000 పౌనులు నూలువస్త్రం 15,46,000 గజములు, జనపనార 2,469టన్నులు, రెయాన్ దారం 3,82,000 పౌనులు, రెయాన్ వస్త్రములు 4,12,000 గజములు, ఎముకలఎరువులు 268 టన్నులు, రసాయనిక ఎరువులు 188టన్నులు, వెల్డింగ్ గ్యాసులు- ప్రాణవాయువు, 878000ఘనపుటడుగులు అగ్గిపెట్టెలు ఒక్కొక్కదానిలో 40 పుల్లలుగల 4.561 గ్రోసుల పెట్టెలు గాజు 180 టన్నులు, సిమెంటు 65570 టన్నులు, సబ్బు 10 టన్నులు, అస్‌బెస్టాస్, సిమెంట్ 1,725టన్నులు. బొగ్గు 204,000 టన్నులు, కాగితం 3,000 టన్నులు, చక్కెర 18,017 టన్నులు, వనస్పతి 1,092 టన్నులు, సిగరెట్లు 5,776 లక్షలు, ఉప్పు 13,58,000 మణుగులు.

పరకాల ప్రభుత్వోపాధ్యాయ సంఘం

పరకాల, జూలై 10

స్థానికప్రభుత్వోన్నత పాఠశాలావరణలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోపాధ్యాయసంఘం పరకాలసమితి సర్వసభ్యసమావేశం సమితిఅధ్యక్షులు శ్రీ వెలపాటి రామరెడ్డిగారి అధ్యక్షతన జరిగినది. కార్యదర్శి నివేదిక,గత సంవత్సర ఆదాయవ్యయములు, 60-61వ సంవత్సరమునకు సమితి ఆదాయవ్యయఅంచనాలు ఆమోదింపబడినవి. తదుపరి అధ్యక్షులచేనియుక్తులైన ఎన్నికల నిర్వహణాధికారి శ్రీ పి. పురుషోత్తంగారు మాతన కార్యనిర్వాహకుల ఎన్నికలుజరిపించిరి శ్రీయుతులు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు,సి.జనార్దనరెడ్డి, కె.జగ్గయ్య టి. మురళీధరస్వామి, సాదిక్ అహమ్మద్‌గారలు క్రమంగా, అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికులుగా ఎన్నికైరి. ఎన్నికలఅనంతరం సంఘపరిస్థితావశ్యకతను వివరిస్తూ శ్రీయుతులు పి. పురుషోత్తం, మహమ్మద్ మస్తాన్, రామరెడ్డి, డి. వెంకటేశ్వరరావులు సభ్యులనుద్దేశించి ప్రసంగించిరి.

జమ్ము-కాశ్మీర్ విద్యార్థులకు బి.డి.ఎస్. తరగతులలో సీట్లు

కేటాయింపు

న్యూఢిల్లీ, జూలై 10

జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం కోరికపై, ఆరాష్ట్రానికిచెందిన విద్యార్థులకు ఇతరరాష్ట్రాలలోని దంతవైద్య కళాశాలలలో 1960-61వ సంవత్సరానికి బి.డి.ఎస్. తరగతిలో సీట్లు కేటాయింపుకూగాను కేంద్రఆరోగ్యమంత్రిత్వశాఖ ఏర్పాట్లుచేసింది.

మద్రాసుప్రభుత్వం మద్రాసు మెడికల్ కాలేజీలోని దంతవైద్య విభాగంలో ఒకసీటు, పశ్చిమబెంగాలు బొంబాయి, కేరళ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలూ, బొంబాయిలోని నాయర్ హాస్పిటల్ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాలూ, తమతమ కళాశాలల్లో తలా 2 సీట్లను ఇలా కేటాయించడానికి అంగీకరించారు.

ప్రపంచంలో మలేరియా నిర్మూలన తథ్యం

వైద్యప్రముఖుని విశ్వాసం

జెనీవా, జూలై 10

"ప్రపంచంలో అత్యధిక భాగం నుంచి త్వరలోనే మలేరియా నిర్మూలనమవుతుంది" అని డా॥ ఎం. జి. కాండో (బ్రెజిల్) విశ్వాసం. ఆయన ప్రపంచ ఆరోగ్యసంస్థకు డైరెక్టర్ జనరల్.

"వరల్డు హెల్తు" అనేపత్రిక కాజా సంచికలో ఆయన మలేరియావ్యాధి గురించి వ్యాసంవ్రాస్తూ, దానిలో ఈవిధంగా పేర్కొన్నారు:

ప్రపంచంలో మలేరియావ్యాధిపీడితులసంఖ్య, మలేరియా రాగలప్రాంతాలలో నివసిస్తున్న వారిసంఖ్య కలిసి 140కోట్లుఉండేది. అటువంటిది ఈ సంఖ్య క్రిందటిసంవత్సరానికి 27కోట్ల 90లక్షలయింది.

"మొత్తం 68కోట్ల 40లక్షలమంది జనాభాగలదేశాలలో మలేరియా నిర్మూలనకు అతితీవ్రప్రయత్నాలు సాగుతున్నవని జెనీవా చేరినవార్తలు తెల్పుతున్నవి

రాష్ట్రంలో అంటువ్యాధులు

మే నెల సమీక్ష

హైద్రాబాద్, జూలై 10

గడచిన మేనెలలో రాష్ట్రంలో కలరా ఎక్కడాసోకలేదు ఏప్రిల్‌లో ఒకరికిసోకగా అటక్కడూ మరణించారు. అయినప్పటికీ ప్రజారోగ్యశాఖ సిబ్బందివారు అవసరమైన నివారణ చర్యలు తీసుకుంటూనే వున్నారు.

మసూచికం:- మసూచికం చాలవరకు తగ్గుముఖంపట్టింది. 129మందికి సోకగా అందులో 89మంది చనిపోయారు. ఏప్రిల్‌లో సోకినవారినంఖ్య 998 మృత్యువాతపడినవారు88మంది. ఈవ్యాధి శ్రీకాకుళం, విశాఖపట్నం. తూర్పు, పశ్చిమగోదావరులు కృష్ణా, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో అక్కడక్కడా మాత్రమే సోకింది మిగతాజిల్లాలలోనూ జంటనగరాలలోనూ మసూచికం అసలేలేదు. 1269 ప్రాథమికటీకాలతోపాటు 14325 టీకాలువేయబడినాయి.

ప్లేగు:- యీనెలలోగూడ ప్లేగు అసలు వ్యాపించలేదు. ప్లేగువ్యాధికి అనుకూలంగావుండే ప్రదేశాలలో విహారణచర్యలుతీసుకున్నారు.

డిప్తీరియా: హైద్రాబాదు జ్వర ఆసుపత్రిలో డిప్తీరియాకేసులు 32 చేర్చుకున్నారు. అందులో రెండుకేసులు తీవ్రమైనవి.

ఎంటరిక్ జ్వరం:- అదేఆసుపత్రిలో యీజ్వరానికి88గురుచేరారుఇందులో రెండుకేసులు తీవ్రమైనవి.

రాష్ట్రంలో మెట్రిక్ పద్ధతి

మెట్రిక్ తూకాలు,కొలమానాలను 1-10-1960 తేదీనుండి అనుసరించే విషయాన్ని చర్చించటానికిగాను 28-6-60వతేదీ సాయంత్రం 4గంటలకు శ్రీ కొత్తూరు సీతయ్యగుప్త (ఎం.ఎల్.ఏ) అధ్యక్షతక్రింద ఉస్మాన్ గంజ్ మార్కెట్ కమిటీకార్యాలయంలో మార్కెట్‌కమిటీసమావేశం జరిగింది. ఈసమావేశానికి అసిస్టెంట్ మార్కెటింగ్ ఆఫీసరూ, తూకాలు కొలమానాలశాఖ అసిస్టెంటు కంట్రోలరూ హాజరయ్యారు. వ్యాపారస్థులకు కొలమానాలతో తూకాలతో సంబంధంవున్న వారికి మెట్రిక్ తూకాలవాడకం విధానాన్నిగురించి ప్రయోగప్రదర్శనచేసి చూపబడింది. అంతేకాకుండా మెట్రిక్ పద్ధతిమీద హిందీ తెలుగుభాషలలో ఒకఫిల్ము ప్రదర్శనకూడా చూపటమయింది. మారకం పట్టికలు, పోస్టర్లు, కరపత్రాలలాంటి ప్రచారసాధనాలు వ్యాపారస్థులకు పంచిపెట్టబడ్డాయి.

రూ.25,000 విలువగల పొదుపుపత్రాలు

హైద్రాబాద్, జూలై 10

రూ. 25,000ల విలువగల జాతీయ వ్రణాళిక పొదుపుపత్రాలను ప్రవేశపెట్టినట్లు కేంద్రప్రభుత్వంప్రకటించింది.

1959 డిసెంబరు 8వతేదీతో వెలువడిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన యఫ్ 7-(4)-యన్ యస్58 నెంబరుగల ప్రకటనకు మే 16వతేదీ నుండి దిగువనవరణలు వర్తిస్తాయని ఆదేశాలివ్వబడినాయి.

1. మూడవరూపులోవున్న రు. 5, రు. 10 మరియు రు. 100, రు 500, రు 1000 మరియు రు. 5000" అనే అక్షరాలు, మాటలు, అంకెలక్రిందులు "రు. 5, రు. 10, రు 50, రు. 100, రు. 500, రు. 1000, రు. 5000 మరియు రు. 25000" అని చదువుకోవాలి.

2. వాల్లవరూలులో క్లాజు (ఎ) లోని సబ్‌రూలు (2) తరువాత దిగువ వాక్యం చేర్చుకోవాలి:-

"నోటు:- ప్రావిడెంటుఫండుల ద్వారా వర్చేపెట్టబడులకుమాత్రమే రూ. 25000ల విలువగల పత్రాలు ఇవ్వబడుతాయి.

లేఖావళి

కార్పొరేషన్ లలీనీకరణ జరుగాలి

ఆర్యా!

ఇంతకుపూర్వమే యొకనాడు జరుగవలసియుండినది హైద్రాబాదు సికింద్రాబాదు కార్పొరేషన్‌ల లినీకరణ విశాలాంధ్రావతరణకు యిదినాందీ. వాక్కులు పలకాలని (1956) అప్పటి స్థానిక పరిపాలనశాఖా మాత్యులు శ్రీ గోపాల్ రావు ఎల్కోటేగారి యిచ్చు, పట్టుదలకూడ కాని సికింద్రాబాద్ కార్పొరేషన్ నభ్యులు వద్దన్నారు తమకిష్టము లేదన్నారు. అప్పుడు యీవ్యవహారముతో కేంద్రమంత్రి శ్రీ గోవింద వల్లభ్‌పంత్‌గారు జోక్యముకలిగించుకొని కొలదికాలమువరకు, విలీనీకరణ వద్దని అప్పటి ముఖ్యమంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారికి యుత్తరము వ్రాశారు. శ్రీ పంత్‌గారి యుత్తరాన్ని శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు. మంత్రి శ్రీ ఎల్కోటేగారికి చూపెట్టి వారిప్రయత్నాన్ని మట్టుబెట్టారు. తద్వారా విలీనీకరణ జరుగాలి అను సిద్ధాంతము సికింద్రాబాదు కార్పొరేటర్ల స్వార్థానికి బలి అయినది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడినతరువాత తక్షణమే ముక్కోటిఆంధ్రులకు రాజధానియైన యీపట్టణమునకు ఒకటే బలవంతమైన కార్పొరేషను ఏర్పాటుగునని విశ్వసించారు. కాని అదియు కొనసాగలేదు అవిశ్వాసము రాజధాని నగరమందలి కాంగ్రెసు యందుండు ముఠాలకు ఆహుతి అయినది.

శ్రీ సంజీవయ్యగారి మంత్రివర్గ మేర్పడిన తరువాత పురపాలకసంఘాలి మంత్రిగాయుండిన శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డిగారు ఉభయ కార్పొరేషన్‌లవిలీనీకరణచెయ్యాలనిదానివలన అనేకలాభాలుండునని తీవ్రప్రయత్నము చేశారు. కాని దురదృష్టసంఘటనవల్ల వారిఉద్దేశము పూర్తికాలేదు

ప్రస్తుతము ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యగారే యీ పురపాలక సంఘాల విషయాలను చూసుకొనుచున్నారు మొన్నజరిగిన ఉభయనగరాల కార్పొరేషన్‌ల ఎన్నికలలో కాంగ్రెస్ దెంతబలం పోగొట్టుకున్నదో యిదిఅందరకు అవగాహనము ముఖ్యమంత్రులుగూడగ్రహించియుండుదురు సంస్థకు యింతటి ముప్పువాటిల్లటము అంటే కాంగ్రెస్‌సిద్ధాంతాన్ని స్వార్థానికి బలియివ్వటమనియే అర్థము. ఉభయకార్పొరేషన్‌ల విలీనీకరణ అటుపక్కకేగాకుండ ఇటురాజధాని నగరాభివృద్ధికికూడదోహదము చేస్తుంది. కార్పొరేషన్ విశాలమైచాలా పటిష్టంగా తయారౌతుంది కూడ.

అందుచేత కనీసము యిప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వము వెంటనే ఉభయనగరాల కార్పొరేషన్‌లనువిలీనీకరణ చేసి, జంటనగరాలకొక విశాల పటిష్ట కార్పొరేషన్ యిదే శాసనసభా సమావేశముతో యేర్పాటు చేసి వర్గాలకు సరియగు సారధ్యము వహించవలసునని ప్రార్థన.

ఇట్లు
పా. పుల్లారెడ్డి

కె ఇ ఎమ్. ఆసుపత్రిలో రోగుల యిక్కట్లు

ఆర్యా!

ఈరోజుల్లో నిరుద్యోగం పెరిగిపోట్టగడిపేదే కష్టంగాయుంటే కొత్తకొత్త వ్యాధులుకలుగుచుండడం నిత్యంమనం చూస్తూన్నాం.

ప్రస్తుతం మనదేశంలో తగినంత వైద్యసౌకర్యం లేకను, ఉన్నవాటియందైనను సక్రమంగా జరుగకపోవడము, పేద జనులకు అందుబాటులో లేకపోవడం శోచనీయమైనది. దీర్ఘవ్యాధులచే బాధపడుచు డబ్బులేక ఉన్నడబ్బును యిదివరకే ఖర్చుపెట్టుకోవడము, దినదినము వ్యాధులు పెరిగిపోవడము ప్రభుత్వ ఆసుపత్రులలోనైన చికిత్సపొందుదామని కోండంత ఆశతో గ్రామాలనుండి రావడం డాక్టర్ నిర్లక్ష్యానికి గురికావడం, నిరాశతో వానా తిప్పలుపడి తిరిగిపోయినవారిని ఎంతోమందిని చూస్తూన్నాము. ప్రభుత్వ వైద్యశాఖాధికారులు చూస్తు యుండడమేగాని, తగిన కట్టుదిట్టములు తగు చర్య తీసుకున్నదోలేదా? రోగులకు చికిత్సచేయక, డబ్బుయిస్తే వ్యాధి తగ్గుతుందని లేదా యిక్కడ ఈరోగానికితగినచికిత్సలేదని అయిన ఖరీదైన ఔషధాలు వాడుతే తగ్గుతుందని ఏవోసాకులుచెప్పి డబ్బు లాగడం పరిపాటైంది.

ఆసుపత్రిలో అధికారులనుండి వర్కులు, చాయిలవరకు నిర్లక్ష్యము ఎక్కువైంది. డాక్టర్లు, వర్కులు, రోగులను కసురుతు మాట్లాడుతారు ఉన్నోమార్లు ప్రజలు మొరపెట్టుకున్నా పరిస్థితులు కించిత్తుకూడా మారినట్లుకనబడదు. ప్రభుత్వం యిచ్చేమందులు, ఇంజక్షనులు ఏమైపోతాయోగాని కావలసిన ఇంజక్షన్ మందులు రోగులకుకాని బలవంతముగా కొనిపిస్తారు. ఎవరైన ప్రశ్నిస్తే పెడచెవిన పెట్టడం, ప్రభుత్వము ఇచ్చే ఖరీదైనమందులన్నీ తమతమ స్వంత ప్రాక్టీసులో రోగులకు ఉపయోగించడం, లేదనకపోతే ఎర్రనీళ్ళు, పచ్చనీళ్ళు యిచ్చి పంపడం చూస్తూన్నాము. డబ్బు యిస్తేనే ఇంజక్షన్, ఔషధం ఇస్తారని డబ్బులేనివారికి చికిత్స జరుగడము పట్టదని ప్రజలు భావిస్తున్నారు ప్రజల ఆరోగ్య సౌకర్యాల విషయము ప్రభుత్వము తీసుకుంటున్న శ్రద్ధ ఎక్కువే కావచ్చు. కాని అధికారుల నిర్లక్ష్య ప్రవర్తనచే స్థితిగతులు ఏవిధంగా పరిణమిస్తాయో రాష్ట్ర ఆరోగ్యశాఖా మాత్యులు ఊహించుకోవాలి.

వ్యాధి గ్రస్తులపై అన్యాయాలు అక్రమము జరుగకుండా ఒక కమిటీని నిర్ణయించి తగిన చర్యలు తీసుకుంటే సామాన్యులకు కొంత మేలు జరుగుతుంది. ప్రజలకు వైద్యసౌకర్యంఅందుబాటులో వుండునట్లు తగిన శ్రద్ధ వహించవలయునని, ఆరోగ్య శాఖా మాత్యులవారి సత్ప్రణాళిక ప్రకారము ఏర్పాటుచేయగలరని కోరుచున్నాను.

సికింద్రాబాద్
10-7-60

ఇట్లు
డా॥ డి. హనుమంతరావు

పిల్లలచేత స్నానం చేయించే పరికరం

లండన్, జూలై 10

ఇన్‌ఫ్లుయెంజాతో మంచమెక్కింది ఎడ్వర్డు రస్లెండ్ భార్య. షెడ్డింగ్టన్‌లో ఇంజనీరు రస్లెండ్, పసిపిల్లవాడి చేత స్నానం చేయించి తువాలా తీసుకొద్దామని వెళ్ళాడు. పిల్లవాడు స్నానం పళ్ళెంలో పడిపోయాడు. కాస్తలో పెద్ద ప్రమాదమే తప్పింది. ఆలోచించ వారంభించాడు రస్లెండ్. హాయిగా పిల్లలచేత స్నానం చేయించడానికి ఉపయోగపడే "సీట్" తయారు చేశాడు. సులభంగా ఎక్కడికైనా తీసుకువెళ్ళవచ్చు. స్నానంచేసే పసికందులు ఇష్టం వచ్చినట్టు ఆడుకునే వీలుంటుంది.

"బేబీ అంకా" అనే యీ పరికరం ఇప్పుడు అమ్మకంలో ఉన్నది. కుర్చీమాదిరిగా ఉంటుంది ప్లాస్టిక్‌తో తయారైనది. పసిపిల్లలు అటూఇటూ కదులుతూ, పడిపోకుండా ఆడుకుంటూంటే స్నానం చేయించడానికి ఉపయోగపడుతుంది. తుప్పుపట్టదు. త్వరగా పాడైపోదని చెబుతున్నారు దానిని తయారు చేసినవారు.

Matchless performer at a moderate Price!

- యావత్ప్రపంచాన్ని మీ సమక్షాననిలుపగల నవీన పరికరాలతోడి సూపర్-హెట్రాడైన్ రేడియో
- 5 వాల్వుల ఎ. సి. ఆర్. లేక
- 8 బాండ్ లక్క పూత పూయబడిన అందమైన కొయ్య కాబినెట్
- అందరికీఅందుబాటులోఉన్న ధర
- Rs. 220/- NETT

A new RESA JUNIOR MODEL

Phone: 84380
Grams: "ASSEMBLER"

RESA RADIO SHOW ROOM
'MUSEE MUSICAL'
P. B. 3755
3/16, Mount Road, Madras-2.

10 వ సంయుక్త వారము

జగపతి పిక్చర్స్ వారి

అన్నపూర్ణ

కమల్ హైద్రాబాద్. రాజరాజేశ్వరి వరంగల్.

నేడు 2 ఆటలు: 6-00 మరియు 9-30 గం॥

చిత్రా - సికింద్రాబాదు.

సికింద్రాబాదు చిత్రాటాకీసులో ఆటలు: 10-30, 2-30, 6-00, 9-30 గం.

(Nima) శ్రీ నేషనల్ ఆర్టు పిక్చర్స్ విడుదల.

4 వ సంయుక్త వారము

తిరుమల పిక్చర్స్ వారి

సమాజం

తా॥ రాజసులోచన, గిరిజ, జగ్గయ్య, రేలంగి,

సాగర్ - హైద్రాబాద్.
ఆటలు: 6-00, 9-45 గం॥

రాజేశ్వర్ - సికింద్రాబాద్.
నేడు 4 ఆటలు: ఉ॥ 10-00, సా॥ 2-00, 6-00 మరియు 9-45 గం॥

మీ సీట్లను ముందుగా రిజర్వు చేసుకోండి!

(Trupix) ఛమ్రియా విడుదల.

5 వ దిగ్విజయ సంయుక్త వారం!

అలంకార్ చిత్ర వారి

సర్‌హద్

తా॥ దేవానంద్, సుచిత్రాసేన్, రాగిణి. అన్వర్, సజ్జన్.

దర్శకత్వం: శంకర్ ముఖర్జీ. సంగీతం: సి. రామచంద్ర.

అశోక్ హైద్రాబాద్. ఆటలు 6-15, 9-45 గం॥

ప్యారడైజ్ (పర్‌కండిషన్డ్) సికింద్రాబాద్. ఆటలు: 3-00, 6-15, 9-45 గం

పెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.

(Trupix) చిత్రకళాపిక్చర్స్ విడుదల.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

రెవిన్యూ శాఖ

తెలంగాణా ప్రాంతములోని రాజకీయ బాధితులకు భూములు కేటాయింపు విషయమై వుత్తరువులు:-

జి. ఓ. మిస్. నెం. 1110 హైదరాబాదు, తేది: 1960 మే. 26

ఉత్తరువు

ఆంధ్రప్రాంతం లోని రాజకీయ బాధితుల విషయంలో మాదిరే తమకు గూడా భూములను మంజూరుచేయవలయునని కోరుతూ తెలంగాణా ప్రాంతం లోని రాజకీయ బాధితులు పెట్టుకున్న అనేక విజ్ఞాపనలు ప్రభుత్వం వారికి అందినవి ప్రభుత్వం, ఈ విజ్ఞాపనలను శ్రద్ధతో పరిశీలించినమీదట, ప్రభుత్వ ఆధీనంలో వున్న భూములను తెలంగాణా ప్రాంతంలోని రాజకీయబాధితులకు ఒక్కొక్కరికి 5 ఎకరాల మాగాణి భూమిగాని, 10 ఎకరాల మెట్టభూమిగాని ఉచితంగా యీయవచ్చునని ఆదేశిస్తున్నది. అయితే, భూమి మంజూరు చేయబడువారు పొలాలలో వున్న చెట్లు, భవనాలు లేక ఇతర కట్టడాల వెలను, సర్వేమార్కుల ఖర్చును చెల్లించాలి.

ఈ పదుపాయం కోసం రాజకీయ బాధితులనగా భారతస్వాతంత్ర్య సముపార్జన కోసం భారతజాతీయకాంగ్రెసుచే గాని దాని అనుమతితో గాని లేక హైదరాబాదు రాజ్యకాంగ్రెసు వారిచేగాని దాని అనుమతితో గాని, ప్రారంభించబడిన ఉద్యమములలో పాల్గొనినందున నేరస్తులుగా ఎంచబడి ఎంతకాలమైన ఖైదుశిక్ష విధించబడిన వ్యక్తులు అని అర్థము. ఆ వుద్యమాలలో మరణించిన, ఆవుద్యమములో పాల్గొని ఆ తరువాత మరణించిన వారి కుటుంబాలలోని ఆర్థిక సభ్యులు కూడా ఈ పదుపాయాలకు అర్హులై వుంటారు అయితే సంబంధించిన కుటుంబంలోని సభ్యులందరికి మంజూరుచేయబడే మొత్తం భూమి మాగాణి అయితే 5 ఎకరాలకు మెట్టఅయితే 10 ఎకరాలకు మించి కూడదు. భారత జాతీయ కాంగ్రెసు పట్ల భక్తిప్రపత్తులు కలిగియుండని వ్యక్తులు ఈ పదుపాయానికి అర్హులు కారు ఈక్రింది వుద్యమాలు భారత జాతీయకాంగ్రెసుచే గాని దాని అనుమతితోగాని హైదరాబాదు రాజ్యకాంగ్రెసుచే గాని ప్రారంభింపబడిన వుద్యమాలుగా పరిగణింపబడతాయి:

1. 1921 లో జరిగిన సహాయ నిరాకరణోద్యమం
2. నాగపూర్ జండా సత్యాగ్రహం
3. 1928-29 లో జరిగిన సైమను కమిషను బాయికాట్
4. 1930 లో జరిగిన వుప్పు సత్యాగ్రహం
5. 1933 లో జరిగిన శాసనోల్లంఘన వుద్యమం
6. 1940-41 లో జరిగిన వ్యక్తి శాసనోల్లంఘన వుద్యమం
7. 1942 లో జరిగిన వ్యక్తి శాసనోల్లంఘన వుద్యమం
8. 1942 లో జరిగిన క్విట్ యిండియా వుద్యమం
9. హైదరాబాదు రాజ్యాన్ని కేంద్రప్రభుత్వంలో కలపడానికిగాను ప్రారంభించిన 1948 సెప్టెంబరు పోలీసుచర్యకు దారితీసిన హైదరాబాదు రాజ్యకాంగ్రెసు వుద్యమం.

పై 1 వ పేరాలో పేర్కొనబడిన పదుపాయాలకు అర్హులైన వ్యక్తులు ఈ పథకం ప్రచురింపబడిన తేదీనుండి మూడు నెలల లోపుగా సంబంధించిన తహసీల్దారులకు వేరేటట్లు దరఖాస్తులను పెట్టుకోవాలి. ఆ తరువాత అందిన దరఖాస్తులు అంగీకరింపబడవు. ఆ దరఖాస్తులు ఇతర విషయాలతో పాటు ఈ క్రింది వివరాలను కలిగి యుండాలి.

1. భూమివున్న గ్రామము, పీలైతే సర్వేనెంబరు మొదలగునవి. (దరఖాస్తుదారులు నిరాక్షేపణీయమైన భూములను మాత్రమే పేర్కొనాలి)

2. తగునిదర్శనంతో సహా జాతీయ ఉద్యమాలలో పాల్గొన్నందున రాజకీయ బాధితులు అనుభవించిన శిక్ష వివరాలు.

(అట్టి నిదర్శనం క్రింద జిల్లాకాంగ్రెసు కమిటీలనుండి పొందిన సర్టిఫికేట్లను జతచేయాలి.) మరియు

3. దరఖాస్తుదారు రాజకీయబాధితుల కుటుంబంలోని సభ్యుడుమాత్రమే అయిపట్టయితే ఆతనికి/ ఆమెకు అతనితో/ ఆమెతో గల బంధుత్వం కుటుంబంలోని యితర సభ్యులందరి యొక్క స్టేటుమెంటు తగునిదర్శనంతో సహా అతడు/ ఆమె ఈ పదుపాయాన్ని కోరుటకుగల పరిస్థితులు, సంబంధించిన రాజకీయ బాధితుని శిక్షకు సంబంధించిన సర్టిఫికేటుకూడ అవసరం.

ముఖ్యమైన వివరాలు లేని దరఖాస్తులు పూర్తిగా నిరాకరించబడతాయి.

4. దరఖాస్తులను స్వయంగా కాని వకీలుద్వారా కాని అటార్నీద్వారా కాని మరి ఇతరవ్యక్తిద్వారా కానీ లేక తిరుగు రసీదుతో రిజిస్టరు పోస్టుద్వారా గాని పెట్టుకొనవచ్చును.

5. నిర్ణీతతేదీన గాని ఆలోగా గాని అందిన దరఖాస్తులను అనుబంధంలో ఇచ్చిన నమూనాలోని రిజిస్టరులో నమోదుచేయాలి. ఆ రిజిస్టరు తాలూకా ఆఫీసులో వ్రాసి ఉంచబడాలి.

6. తాసీల్దారు దరఖాస్తులు అందిన వెంటనే వాటిని పరిశీలించాలి. ఆయన దరఖాస్తు అందిన తేదీనుండి ఒక నెలలోగా దానిని అంగీకరిస్తూ గాని, నిరాకరిస్తూగాని దానిపై ఉత్తరువులు జారీచేయాలి. తాసీల్దారు యొక్క ఉత్తరువు ప్రతిఒకటి తక్షణమే అభ్యర్థికిని, ఉత్తరువు చేసిననాటినుండి మూడు దినములలోగా కలెక్టరుకును పంపబడాలి.

7. తాసీల్దారుచేసిన ఉత్తరువులపై నష్టపడిన వ్యక్తి ఆ ఉత్తరువు విషయం తనకు తెలిసినవాటినుండి పదిహేను రోజులలోగా డెప్యూటీ కలెక్టరుకు అప్పీలుచేసికొనవచ్చును. డెప్యూటీకలెక్టరు, అప్పీలు చేయబడిన తేదీనుండి పదిహేను రోజులలోగా అప్పీలుపై తీర్పుచేయాలి.

8. డెప్యూటీ కలెక్టరు ఉత్తరువు అంతిమమైయుండవలెను. అయితే ప్రభుత్వం వారికి తమంతతామాగా గాని రాజకీయబాధితుడు అర్జీదాఖలుచేసికొన్న మీదట గాని ఎవరేనివ్యక్తి రాజకీయబాధితుడైనది కానిది నిర్ణయించే హక్కు ఉంటుంది.

9. తాసీల్దారు, డెప్యూటీ కలెక్టరు, ప్రభుత్వంవారు జారీచేసిన ఉత్తరువులన్నీ ఒకేపైలులో రికార్డు చేయబడాలి.

10. మూడు నెలల నిర్ణీత గడువు దాటిన పదిహేను రోజులలోగా తాసీల్దారు 5 వ పేరాలో పేర్కొనబడిన రిజిస్టరు ఊర్ధ్వాంశమును నిర్ణీత గడువులోగా అందిన అన్ని దరఖాస్తులను దానిలోచేర్చి కలెక్టరుకు పంపాలి. కలెక్టరు కార్యాలయంలో 6 నుండి 8 వరకు గల పేరాలలో తెలిపిన ఉత్తరువులను బట్టి 8 నుండి 12 వరకు ఉన్న కాలంలలో నమోదులుచేయబడాలి.

11 నిర్ణీతగడువు దాటిన తరువాత అందిన అర్జీలు ఏ కారణం వల్లనైనా మంజూరు చేయబడకూడదు.

12. ఈ జి. ఓ. ప్రతి ఒకటి ప్రతి కలెక్టరు, డెప్యూటీకలెక్టరు, తాసీల్దారు కార్యాలయం నోటీసు బోర్డుమీద మూడు నెలల పాటు ఉంచబడవలెను.

(ఆంధ్రప్రదేశ గవర్నరుగారి ఉత్తరువు క్రింద, వారి పేరట.)

సి. శేషగిరిరావు,
ప్రభుత్వ కార్యదర్శి.

—: : : :—

అనుబంధము

1. వరుస సంఖ్య,
2. దరఖాస్తు అందిన తేదీ,
3. దరఖాస్తుదారుని పేరు, చిరునామా,
4. దరఖాస్తు దారే రాజకీయబాధితుడు కాకపోతే రాజకీయబాధితుని పేరు, వివరాలు, దరఖాస్తుదారునికి, రాజకీయ బాధితునితోగల బంధుత్వం, రాజకీయ బాధితుడు జీవించియున్నది లేనిది మొదలగునవి.
5. రాజకీయబాధితుడు పాల్గొనిన ఉద్యమాల వివరాలు, అతనిపై మోపిన నేరాలు.
6. 5 వ కాలంలో తెలిపిన వివరాలకు నిదర్శనంగా సమర్పించిన సర్టిఫికేట్ల వివరాలు.
7. దరఖాస్తులో కోరబడిన భూమి వివరాలు.
8. దరఖాస్తుపై తాసీల్దారు జారీచేసిన ఉత్తరువులు.
9. అప్పీలు చేసికోబడితే దానిపై డెప్యూటీ కలెక్టరు జారీచేసిన ఉత్తరువులు.
10. ప్రభుత్వంచేసిన ఏవేని ఉత్తరువులు.
11. మంజూరు చేయబడిన భూమి వివరాలు.
12. రిమార్కులు.

గమనిక :- 1 1 నుండి 7 వరకు గల కాలంలు దరఖాస్తులో తెలిపిన వివరాలను బట్టి నింపబడవలెను.

2. 8 నుండి 10 వరకు గల కాలంలు దరఖాస్తుదారుని రాజకీయబాధితునిగా అంగీకరించినది లేనిదీ నిర్ణయించు ఉత్తరువులకు సంబంధించినట్టివి.

8, 8. 11 కాలంలలోని నమోదులను తాసీల్దారే స్వయంగా వ్రాయవలెను.

సి. శేషగిరిరావు,
ప్రభుత్వ కార్యదర్శి.

ఖ్యాతిచెందిన ఖైదీలు

డేల్ కార్నేజ్

చిన్నకథనువ్రాయడంలో ప్రఖ్యాతి చెందినవ్యక్తి ఎవరని మీరనుకుంటున్నారు? అతనికథల్ని మీరుచదివారు. అరవైలక్షల కాపీలకుపైగా అతని పుస్తకాలు అమ్ముడు పోయాయ్. ప్రపంచంలోవున్న ప్రతిభాషలోకి అతనికథలు అనువదించ బడ్డాయవే చెప్పవచ్చు. అతనికలం పేరుట. హెన్రీ.

అతను సుమారు 90 సంవత్సరాల క్రితం జన్మించాడు. విపరీత మయిన కష్టనష్టాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడేవ్యక్తి జీవితానికి ఓ హెన్రీ బ్రతుకు చక్కటి ఉదాహరణ.

అతని మొదటి అవరోధం లాంఛనంగా చదువు రాకపోవడం, హైస్కూలుకు కూడా అతను వెళ్ళలేదు, కాలేజీలోపల ఏముంటుందో, ఏం జరుగుతుందో ఎన్నడూ చూసి ఎరుగడు. అయినా మంచిరచనలకు ఉదాహరణగా ప్రపంచంలో వున్న సగం విశ్వవిద్యాలయాల్లో అతని రచనలు చదవబడుతున్నాయ్.

రెండో అడ్డంకి: ఘోరమయిన వ్యాధులతో నలిగిపోవడం. క్షయవ్యాధితో మరణిస్తాడని డాక్టర్లుభయపడ్డారు. అతని ఇంటినుంచిబెట్టాసాన్కు పంపివేశారు. ఆ కొండల్లో గొర్రెల్ని మేపేపని సంపాదించాడు. ఈవాడు దేశయాత్రలు చేసేవారు కారుల్లో వందలాదిమైళ్ళు ప్రయాణంచేసి హెన్రీ నడిచిన ప్రదేశాల్ని సగర్వంగా తిలకిస్తుంటారు.

మూడోఇబ్బంది: దురదృష్ట వశాత్తు అతను జైలులో పడడం ఆ సంఘటన ఇట్లాజరిగింది: ఆరోగ్యం చేకూరగానే ఆస్టిన్ అనే పట్టణంలో ఒక బ్యాంక్‌లో క్యాషియర్ ఉద్యోగం హెన్రీ సంపాదించాడు. ఆ సమీపంలోని పశువుల కాపరులు, ఆ బ్యాంకుకు వచ్చి హడావిడిగా వుండే గుమాస్తాల దగ్గర తొందరతొందరగా సంతకాలుచేసి, డబ్బు తీసుకొని పోతుండడం మామూలుగా జరుగుతుండేది.

ఒకనాడు అకస్మాత్తుగా స్టేట్ బ్యాంక్ ఉన్నతాధికారి వచ్చి నిల్వవున్న నగదును, ఎకౌంట్ పుస్తకాలను తనిఖీచేశాడు. డబ్బుగల్లంతు కావడం చూశాడు. ఇంకేముందీ? క్యాషియర్ అయిన హెన్రీని అరెస్టు చేశారు. కోర్టుకుతీశ్చారు. నిజంగా ఆ డబ్బులో ఎవ్వరని ఏగాణి అయినా హెన్రీముట్టుకున్న పాపాన పోలేదు. అయినా డబ్బు మాయమైనందుకు అయిదు సంవత్సరాల శిక్ష విధించబడింది.

అప్పట్లో ఈ శిక్ష దురదృష్టకరంగా కన్పించింది. కాని ఒకవిధంగా అది అదృష్టమన్నమాటే. ఎందుకంటే హెన్రీ జైలులోనేవ్రాయడం మొదలు పెట్టాడు. ఇంగ్లీషుభాష మాట్లాడే ప్రతిచోట గౌరవాభిమానాలు పొందేట్టుగా కథలు వ్రాశాడు. అతన్నే కమక జైలుకు పంపివుండకపోతే అసలు వ్రాసేవాడు కాదు.

నేను ఈ మధ్య లాయస్‌తో మాట్లాడాను. సింగ్ సింగ్‌లో వున్న ప్రతి వ్యక్తి తమ జీవితకథల్ని వ్రాసుకొనాలని చూస్తారన్నాడా జైలు వార్డెన్. నిజంగా వారు అనుకుంటారు ఏమంటే స్కూలులాంటి జైలు చిన్నచిన్న కథలు వ్రాయడానికి స్వేచ్ఛ కల్పిస్తుంది. సహజంగా అందులో కొంతమంది మాత్రమే విజయం పొందారు. నీజం చెప్పవలసివస్తే గొప్పగొప్ప వ్యక్తులు జైళ్ళలోనే గొప్పగ్రంథాలు వ్రాశారు.

ఉదాహరణకుసర్ వాల్టర్ ర్యాలీని తీసుకోండి. అతను బూట్స్‌లో వజ్రాలు, చెవులకు ముత్యాలుధరించే వాడు ఎలిజిబెత్ మహారాణి దర్బారులో ముఖ్యుడయిన ఈ ర్యాలీ ఒకసారి తల విలువయిన గడియారాన్ని బురదలో పడవేసి, మహారాణి కాలు దానిమీదవేసి, దాటేట్టు చేశాడు.

కాని రాజకీయ రంగంలో కొంతమంది అసూయ ఫలితంగా, దారుణమయిన 14 సంవత్సరాలు జైలు ఊచల్లోపల గడిపాడు. జైలు గది చీకటిమయం. మహాఇరుకు, చుట్టూ బురదనీరు చలికి గజగజ వణికిపోయేవాడు. ఎడమచెయ్యి పక్షవాతంతో వంకరపోయింది. ఇలా కష్టాలతో కుమిలిపోతున్నా, అప్పుడే, అక్కడే-

900 సంవత్సరాల నంతం కూడా- ఈనాటికి మన స్కూళ్ళలోనూ, కాలేజీలలోనూ చదివే ప్రపంచ చరిత్ర అద్భుతంగా వ్రాశాడు.

జాన్ బనియన్ కూడా- మతప్రచారం చేస్తున్నాడన్న కారణంతో- 12 సంవత్సరాలు జైలులో బంధించ బడ్డాడు ఆకలితో అలమటించే నలుగురు పిల్లలకూ, భార్యకు రొట్టెలు కొనడానికి లేసు అల్లుతుండే వాడు. ఒక ప్రక్కఅతను చేతులు లేసు అల్లుతుండగా, మరోప్రక్క అతనిబుర్ర గొప్ప గొప్పఆలోచనలుచేసేది అక్కడే,ఆచలిలో, ఇరుకులో, మురికిలో, అమెరికాలోని ప్రతివిద్యార్థి చదివిన పుస్తకం వ్రాశాడు. దానిపేరు "పిల్‌గ్రిమ్స్ ప్రొగెస్" బైబిల్ తర్వాత అన్ని గ్రంథాలకంటె, అనేక దేశదేశాల భాషల్లోకి తర్జుమాచేసిన గ్రంథం ఇది ఒక్కటే.

అన్నిశాలాల్లోనూ గొప్పదనిపించుకొన్న "డాన్ క్విక్‌సెట్" అను పుస్తకాన్ని సెరవాన్‌టెస్ జైలులోనే వ్రాశాడు. వాల్టేరు, ఆస్కార్ వైల్డు, డెబ్స్, హిట్లర్ జైళ్ళలోనేవ్రాశారు. ఇంకకూ నేను చెప్పేదిఒక్కటే: మీరేదయినా మంచిపుస్తకం వ్రాయదల్చుకున్నారా? సరే. చిన్న నేరంచేసివేయడం, మీఅంతట మీరుజైలులో పడడం అంతే. అదేమంచి ఐడియా.

200 సంవత్సరముల క్రితం రిచర్డు లవ్‌లేస్ జైలులోకి త్రోయబడ్డాడు. ఇంగ్లీషుభాషలో ప్రసిద్ధిచెందిన ఒక పద్యంలో తన జైలును అద్భుతంగా పొగిడాడు. అది తన ప్రియురాలుకు వ్రాసిన ప్రేమలేఖ:

"రాతిగోడలు జైలును చేయలేవు.
ఇమపక్షీచలుకూడా అంతే.
నిర్మలమైన మనస్సుస్వర్గాన్ని
చేసుకుంటుంది
నా ప్రేమలో నాకు స్వేచ్ఛఉంటే
నా ఆత్మలో నాకు స్వాతంత్ర్యం
వుంటే
దేవకన్యలతో కలిసి
చాగుడుమూతలు ఆడుకుంటాను.

(అనువాదం: శ్రీ పి. వి. రత్నం)

సంక్షిప్తవార్తలు

ఇటలీలో సంధి

రోం, జూలై 9: ప్రస్తుత కలతవాతావరణాన్ని అంతం చేయడానికిగాను ఇటలీసెనేట్ అధ్యక్షుడు సేనరెమెర్జాగోరా ప్రతిపాదనపై సంధికుదుర్చుకోడానికి తన ఆమోదాన్ని తెలియజేస్తూ ఇటలీ కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ గత రాత్రి ప్రకటించినది అంతకుముందు జరిగిన ప్రదర్శనలు కలతలలో ముగ్గురు పౌరులు మృతి చెందటం, మరో 50 మంది గాయపడటం జరిగింది.

ఆందోళన పరులపట్ల కఠినచర్యల్ని గైకొనాలని క్రిస్టియన్ డెమోక్రట్ మైనారిటీ ప్రభుత్వం నిర్ణయించినది.

కరాచీలో రైలుఇంజన్ మాయం

కరాచీ, జూలై 10: ప్రభుత్వ వర్షపాతంలో ఒక పెద్దరైల్వే ఇంజన్ కనిపించకుండా పోయింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరమ్మతులకై యీ యింజన్‌ను 15 రోజులుగా పెద్దులో ఉంచారట.

బ్రహ్మపుత్రానది వరదలు

దిబ్రుగర్, జూలై 10: ఉపనదులు అధిక వర్షాలకు పొంగి ప్రవహించడంతో బ్రహ్మపుత్రానది నీటిమట్టము కూడ పెరుగుతున్నది. 344.29 వరకూ నిన్న నీటిమట్టం పెరిగింది. గతసంవత్సరం ఎన్నడూ 348.80 కి మించలేదు. దిబ్రుగర్‌లో ఎడతెగని వర్షాలు కురుస్తున్నందున పల్లపు ప్రాంతాలు మునిగిపోయినవి.

జెకోస్లేవేకియా ప్రధాని షిరోకి రాజీనామా

ప్రాగు, జూలై 10: జెకోస్లేవేకియా ప్రధాని విలియం షిరోకి తన మంత్రివర్గం రాజీనామాను నేడుప్రెసిడెంట్ అంటోనిన్ నోవోట్నీకి అందజేశారు. ప్రెసిడెంట్ ఆరాజీనామాను ఆమోదించారు. నూతన పార్లమెంటు ఎన్నిక అనంతరం యీ రాజీనామా అవసరమైనది.

ఐక్యఅరబ్ మంత్రితో భారత మంత్రి మురార్జీ చర్చలు

కైరో, జూలై 10: భారత ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ ఐక్య అరబ్ రిపబ్లిక్ మంత్రి డా॥ అబ్దుల్ మోనీమైసునితో ఆర్థిక సహకారాన్ని గురించి చర్చించారు. గత రాత్రి భారత రాయబారి శ్రీ ఆర్. కె నెహ్రూ ఆయన గౌరవార్థం విందు చేశారు. అంతకుముందు శ్రీ దేశాయ్ అరబ్ రిపబ్లిక్ విదేశాంగ మంత్రి శ్రీ ఫౌజిని కలుసుకొన్నారు.

క్యూబాలో కమ్యూనిజం పెత్తనాన్ని సహించమని ఐక్

న్యూయార్కు, జూలై 10: అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ అంతర్జాతీయ కమ్యూనిజం అధ్వర్యములో క్యూబాలో ప్రభుత్వం ఏర్పడడాన్ని అమెరికా సహించబోదని ప్రకటించారు. సోవియట్ ప్రధాని ప్రకటనలో మరో బయటిదేశం, అంతర్జాతీయ కమ్యూనిజం పశ్చిమ దేశాల వ్యవహారాలలో జోక్యం కలిగించుకో బోతున్నట్లు స్పష్టమైనదన్నారు.

జూబ్లీహిల్స్ ఓటర్లు కాంగ్రెస్‌ను గెలిపించాలి

శ్రీనరోత్తమరెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, జులై 10

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీనూకలనరోత్తమరెడ్డి జూబిలీహిల్స్ ఓటర్లకు క్రింది విజ్ఞప్తిచేస్తున్నారు:

"జూబ్లీహిల్స్ నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు జరుగు బై ఎలక్షనుకై కాంగ్రెసుపార్టీ తనతరపున అభ్యర్థినిగా శ్రీమతి రోడామిస్త్రీని నిలబెట్టినది. గత ఎన్నికలో శ్రీమెహదీనవాజ్ జంగ్‌ని ఈనియోజకవర్గం ఓటర్లు గెలిపించి వారి ఓట్లను సార్థకమును సఫలమును చేసికొనిరి.

కావున ఈఎలక్షనులో గూడ ఈ నియోజకవర్గం ప్రజలందరు తమకు కాంగ్రెసునందుగల గాఢవిశ్వాసమును తమ యమూల్యములైన ఓట్లను శ్రీమతి రోడామిస్త్రీకే పూర్ణంకంటే ఎక్కువ మొత్తముగావచ్చునట్లు ఇచ్చి కాంగ్రెసు యొక్క ప్రణాళికలకు బలమును చేకూర్చవలెనని విన్నవించుచున్నారు."

హైద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని విజ్ఞప్తి

హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ కె. సత్యనారాయణ రెడ్డి యిలా వ్రాస్తున్నారు:

"ఈమె 15 అక్టోబరు 1928న సికింద్రాబాదు నగరంలో జన్మించినది. ఈమె ప్రతి రంగములోను తనకు కానైనిస్వార్థ సేవలనుధారపోసినది. ఈమె ప్రభుత్వముచే స్థాపింపబడిన అనేక వాలంటరీ సంస్థలతోను వాలంటరీ బోర్డుతోను సంబంధముగలిగియున్నది. మొన్నటివరకు ఈమె స్టేట్ సోషియల్ వెల్‌ఫేర్ అడ్వైజరీ బోర్డు (నల్గొండ-మహబూబునగరు జిల్లా) లలో మెంబరుగా నుండెను. ఈమె ఈక్రింది సంస్థలతో కూడా సంబంధం కలిగి ఉన్నది.

భారత సోషియల్ వర్కు సమాఖ్య (ఆంధ్రప్రదేశ్ శాఖ) సభ్యురాలు ఆరామఘర్ (అంగహీనుల నిలయం) అధ్యక్షురాలు. "మహిళోద్యోగ" ప్రణాళిక ఇండియన్ కౌన్సిల్ఆఫ్ సోషియల్ వర్కు, వార్డు 9/1 అధ్యక్షురాలు "నీలోఫర్ హాస్పటలుపర్యవేక్షణ బోర్డులో" ప్రభుత్వముచేనియమింపబడిన సభ్యురాలు. "మహిళల విద్యాసాంఘికాభివృద్ధి సంస్థ"కు (హైదరాబాదు శాఖ) స్థానిక కమిటీసభ్యురాలు.

ఈమె మురికివాడల నివారణప్రణాళికలోను రక్తనిధి సేకరణ మొదలగు కార్యములలోను, ఉభయ నగరములలోని బీద పరదా మహిళల ఉద్యోగ కార్యములలోను శ్రద్ధతో చురుకుగా సేవచేయుచున్నది.

శ్రీమతి రోడామిస్త్రీ అధ్యక్షులుగా నున్నప్పుడు ఆరామఘర్‌ను సందర్శించి శ్రీభారత ప్రధానామాత్యులగు జవహర్‌లాల్ నెహ్రూగారు విజిటర్సు బుక్కులో వ్రాసిన క్రింది విషయములబట్టి శ్రీమతి రోడామిస్త్రీ శక్తి సామర్థ్యములు తెలియగలవు:

"శక్తిహీనులను, వికృతాంగులను అంగహీనులనుచూచి యెవ్వరును సంతోషపడరు ఏలనన పైవిశారములను లోపములును వారి జీవితావసరముల నెరవేర్చుకొనుటకు భంగము కలిగించును. కాని సర్వాంగసుందరులై సర్వసౌఖ్యములతో తులదూగువారు, తమ వలెకాక అంగవిహీనులై పేదరిక జీవితావసర సంపాదనకై తహతహ పడుచున్నవారికి అన్నివిధముల సౌఖ్యమును కలుగజేయుచుండుట చూచినపుడు హృదయము ద్రవించిపోవును.

ఇట్టి హృదయ సంచలనము గలుగజేయువానిలో ఆరామఘర్ ఒక ముఖ్యోదాహరణము. ఇందు వికలాంగులై బాధింపబడుచున్న వారికి సకలాంగులైన సజ్జనులు సర్వసౌఖ్యములగూర్చుచున్నారు. కావున నా ప్రశంసా బహుమానముల నర్పించుచున్నాను. ఆరామఘర్ సేవకులు దుఃఖాంధకారమున మునిగియున్న బాధితులకు సుఖ సంతోషపు వెలుగును ప్రసాదించుటలో విజయవంతులగుదురుగాకయని యాశించుచున్నాను."

ఇంతియగాక ఈమె మహిళోద్యోగ ప్రణాళిక సమితికి అధ్యక్షురాలు.

శ్రీమతి రోడామిస్త్రీగారును వారి నిస్స్వార్థ సేవాపరులకు మహిళా కార్యకారిణి వర్గమును ఈక్రిందికార్యకలాపములలో పాల్గొని ప్రజోపకారముజేయుచున్నారు: టీ స్టాల్ అండు షుగరు ప్యాకింగ్, నవార నేయుట, కుట్టుపని, అహార పదార్థముల నిలువ పరచుట, వంటపని.

అత్యల్పమైన ఆరేండ్ల ప్రజాకార్య నిర్వాహణమునకే హైద్రాబాదులో శ్రీమతి రోడామిస్త్రీ చురుకైనవ్యక్తి అత్యుత్తమమైన సంఘనిర్వాహణ ప్రావీణ్యము గలదియనిపేరుపొందిది. కావున నీమెయందలి ప్రత్యేక గుణగణ ప్రావీణ్యముచే భారతదేశము ముమ్మందు ఎక్కువ లాభమును పొందగలదు. కావున మీ ఓటును శ్రీమతి రోడామిస్త్రీగారికే ఇవ్వండి. కాంగ్రెసును బలపరచండి. నేటి యణుయుగంలో భారతదేశాన్ని శాంతిసౌఖ్యమయంగా చేయండి."

ప్రతిబాలిక యొక్క జన్మహక్కును చిత్రించిన ఉత్తమ చిత్రం

ఆటలు: 3-15, 6-15, 9-30 గం॥
మీ సీటును అడ్వాన్సుగా బుక్ చేసుకోండి.
(Nima) ఛమ్రియా పిక్చర్సు

8 వ సంయుక్త వారం
కమల్ అమ్రోహీస్
దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయి

శా॥ మీనాకుమారి, రాజ్‌కుమార్, నాదిర, ఓంప్రకాష్.

రాయల్
హైద్రాబాద్
నేడు 3 ఆటలు:
3-15, 6-15 మరియు 9-30.

మినర్వా
సికింద్రాబాద్.
నేడు 3 ఆటలు;
3-15. 6-15 మరియు 9-30.
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
—శ్రీ సినీ కార్పొరేషన్ రిలీజ్.
(Trupix)

యాత్రాస్థలాలలో బోటునడిపే బాధ్యత

దేవాదాయశాఖకు అప్పగించాలని ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సు

హైదరాబాద్, జులై 10

గత మే 12న మెట్టపల్లి జాతర సందర్భంగా కృష్ణానదిలో జరిగిన బోటుప్రమాదం (87 గురు చనిపోయారు) కారణాల విచారణకు ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యులుగల కమిటీ యాత్రల సందర్భంలో అక్కడబోట్లను నడిపే పూర్తి బాధ్యతను మతాదాయశాఖకు అప్పగించాలని సిఫార్సు చేసింది.

ఈ కమిటీకి గుంటూరుజిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ మేడూరి వాగేశ్వరరావు, (ఎం-ఎల్-ఏ) అధ్యక్షుడు, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ఎం-ఎల్-ఏ మరో అనధికార సభ్యుడు.

కమిటీ గడువుకు 10 రోజుల ముందే తమ నివేదికను నిన్న ప్రభుత్వానికి సమర్పించినది. 20 రోజులలో యీ నివేదికను సమర్పించిన కమిటీని ముఖ్యమంత్రి అభినందించారు.

దేవాదాయశాఖ అన్ని యాత్రాస్థలాలనూ సర్వే చేయాలనీ—ముఖ్యనదీ తీరానగల దేవాలయ ఉత్సవాల విషయమై అన్ని వివరాల్ని పరిశీలించి యాత్రికులు ఆ సమయాలలో నదిదాటే ఏర్పాట్లు చేయాలనీ కమిటీ సూచించినది.

సి.పి.డబ్ల్యు.డి, మద్రాసు

విశాఖపట్టణం పైల్ ఫౌండేషన్స్ వద్ద అదనపు ధాన్యం గోదాములు (2 నెం) నిర్మాణానికిగాను 12-8-60 మధ్యాహ్నం మూడు గంటలలోగా సీల్డు ఐటమ్ వారి టెండర్లను ఆమోదింపబడిన మరియు అర్హమైన సి పి డబ్ల్యు. డి. కంట్రాక్టర్లు మరియు ఎమ్. ఇ. ఎస్. రైల్వేలు కాంట్రాక్టర్లు పి. డబ్ల్యు. డి. [illegible] నుండి భారతాధ్యక్షుని [illegible] ఇంజనీర్ మద్రాస్ సెంట్రల్ డివిజన్ (నార్తు) సి.పి.డబ్ల్యు.డి. మద్రాస్-10 కోరుతున్నారు.

అంచనావేయబడిన ఖర్చు 279496 ధరావతు కట్టవలసిన మొత్తం రు. 6987. టెండర్లు అదేరోజు పగలు 3-15 నిముషాలకు తెరువబడుతవి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ధరావతు సొమ్ము డిపాజిటుచేసి టెండరు వెంట చలాను రసీదుపంపాలి. నియమములు మరియు టెండరు ఫారములు పై కార్యాలయమునుండి రు. 15 (తిరిగి ఇవ్వబడు) చెల్లించి కార్యాలయము పనిచేయు అన్ని రోజులలో ఉదయం 10 నుండి సాయంత్రము 5 లోగా 10-8-1960 వరకు ఒరిజినల్ ఇన్‌కమ్‌టాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఎన్‌లిస్టుమెంటు ప్రూవుచూసి పొందవచ్చును. ధరావతు డబ్బు జిపాజిటు చేయకుండా అందచేయబడే టెండర్లు నిరాకరింపబడగలవు.

DA: 926 (28)/ 60.

నేడే చూడండి!
ముగ్గురు వీరులు
(తెలుగు)
నూర్‌మహల్
అంబర్‌పేట
ఆటలు : 6-30, 9-30.
(Nima)

12 వ సంయుక్త వారము
గురుదత్ వారి
చౌధ్వీ కా చాంద్
ప్రభాత్ హైద్రాబాద్.
ఆటలు: 3-15, 6-30, 9-30 గం॥
అలంకార్ సికింద్రాబాద్.
ఆటలు: 3-30, 6-30, 9-30 గం॥
ప్రభాత్‌లో పూర్తివారము మ్యాటినీలు గలవు.
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.
(Trupix)

10వ దిగ్విజయ సంయుక్తవారము
ఫిల్మాలయా & ఎస్. ముఖర్జీ వారి
లా ఇన్ సిమ్లా

శా: జాయ్‌ముఖర్జీ, సాధన, అజ్రా, కిషోర్ సాహు, శోభన్ సమర్థ్.
దర్శకత్వం:
ఆర్. కె. నయ్యర్,
సంగీతం:
ఇఖ్‌బాల్ ఖురేషి.
ప్యాలెస్- హైద్రాబాదు.
ఆటలు: 6-30, 9-30 గం॥
హెచ్చుతరగతులకు అడ్వాన్సు బుకింగ్
చిత్రకళా పిక్చర్స్ విడుదల.
(Trupix)

తరుణము పోగొట్టుకొనవద్దు
ఆదివారము 17-7-60 నాడు ఆబిడ్ రోడ్‌లో మూసాబిల్డింగ్ వద్ద సి. యం. పి. నెం. 3847 గల హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం నవాబ్ జాఫర్ నవాజ్‌జంగ్ బహద్దూర్ వారి ఆభరణములు
మరియు
పడగొట్టబడిన దేవిడీలనుండి